# భారత్‌కు మెస్సీ బై బై..




అర్జెంటీనా సాకర్ స్టార్ లియోనల్ మెస్సీ భారత పర్యటన దిగ్విజయంగా ముగిసింది. సోమవారం ముంబై నుంచి ఢిల్లీకి ఆలస్యంగా చేరుకున్న మెస్సీకి ఘన స్వాగతం లభించింది. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఇందిరాగాంధీ విమానాశ్రయానికి చేరుకున్న ఈ సాకర్ దిగ్గజం లీలా ప్యాలెస్ హోటల్‌లో ఎంపిక చేసిన కొద్ది మంది అతిథులతో గడిపాడు. ఆ తర్వాత అక్కణ్నుంచి అరుణ్‌జైట్లీ స్టేడియం చేరుకున్న మెస్సీతో పాటు సహచర ప్లేయర్లు లూయిస్ సువారెజ్, రోడ్రిగో ఫ్యాన్స్‌తో కలిసి సందడి చేశారు. తన భారత పర్యటనపై మెస్సీ మాట్లాడుతూ ' ఈ మూడు రోజుల్లో మీరు నాపై చూపించిన ప్రేమ వెలకట్టలేనిది. స్వల్ప వ్యవధిలోనే మీ అందరి ప్రేమాభిమానాన్ని చూరగొనడం మరిచిపోలేనిది. మీరు మా పట్ల కనబరిచిన ప్రేమ, అప్యాయతను ఇక్కణ్నుంచి తీసుకెళుతున్నాం. ఏదో ఒక రోజు భారత్‌లో మ్యాచ్ ఆడేందుకు వస్తాం. అందరికీ కృతజ్ఞతలు' అని అన్నాడు.


నిజామాబాద్
మంగళవారం
16.12.2025

సంపుటి : 16 సంచిక: 81
పేజీలు: 7 వెల: రూ.5

ఎడిటర్ : సిరిగాద ప్రసాద్

# చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక


# 2029 ఎన్నికల్లో పోటీ చేస్తా..!

## కవిత రాజకీయాల్లో చాలా చురుగ్గా ఉంటున్నారు

- సొంతంగా పార్టీ పెట్టే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం
- ఈ క్రమంలో కవిత కీలక ప్రకటన చేశారు
- ఎక్స్ వేదికగా ఆస్క్ కవిత పేరుతో క్వశ్చన్ అవర్
- 2029లో ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు వెల్లడించారు
- రైతుల ఆత్మహత్యలపై కవిత ఆవేదన వ్యక్తం



**చట్టం, స్టేట్ బ్యూరో:**

గత కొద్ది కాలంగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాజకీయాల్లో చాలా చురుగ్గా ఉంటున్నారు. కుటుంబం, బీఆర్ఎస్ పార్టీ నుంచి బయట వచ్చి.. ఆ పార్టీ నాయకులపై తీవ్రంగా విమర్శలు చేస్తూ సంచలనం సృష్టిస్తున్నారు. మరోవైపు అధికార పక్షంపై కూడా విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో కవిత సొంతంగా పార్టీ పెట్టే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో కవిత కీలక ప్రకటన చేశారు. 2029లో తాను ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు వెల్లడించారు. సోమవారం సాయంత్రం 4 గంటల నుండి 5 గంటల వరకు ఎక్స్ వేదికగా ఆస్క్ కవిత పేరుతో క్వశ్చన్ అవర్ నిర్వహించిన సందర్భంగా కవిత ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. ముందుగానే ప్రచారం చేసి..ప్రశ్నలు అడగాలని పిలుపునిచ్చారు. పెద్ద ఎత్తున అడిగిన ప్రశ్నలకు.. కవిత సమాధానాలు ఇచ్చారు. తెలంగాణకు సంబంధించిన కీలకమైన అంశాలపై సమాధానాలు ఇచ్చారు. ఓ నెటిజన్ ముఖ్యమంత్రి అయితే ప్రాధాన్యత అంశంగా ఏది తీసుకుంటారని ప్రశ్నించారు. ఆ ప్రశ్నకు సమాధానంగా కవిత.. ఉచిత చదువుల తెలంగాణనే తీసుకుంటానని చెప్పారు. పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులు రూపాయి కూడా కట్టకుండా చేయాలనుంటానని తెలిపారు. రైతుల ఆత్మహత్యలు కొనసాగుతూడంటపైనా కవిత ఆవేదన వ్యక్తం చేశారు. తన యాత్రలో కొంత మంది ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాలను కలిశానన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే ఇలా జరుగుతున్నాయని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మీద అభిప్రాయం చెప్పాలని ఓ నెటిజన్ కోరారు. దానికి కవిత మూడు ముక్కల్లో సమాధానం ఇచ్చారు. జాగృతి సంస్థపై మరికొంత మంది ప్రశ్నలు అడిగారు. జాగృతిని అన్ని వర్గాల అభ్యున్నతి కోసం పని చేసేలా తీర్చిదిద్దుతానని కవిత తెలిపారు. జాగృతి సభ్యత్వాన్ని త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. ఇంకా పలు ప్రశ్నలకు కవిత సమాధానం ఇచ్చారు. సామాజిక తెలంగాణయే తన లక్ష్యమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మరోసారి స్పష్టం చేశారు. 2029 ఎన్నికల్లో తాము పోటీలో ఉంటామని తేల్చిచెప్పారు. రజలు సూచించిన పేరునే పార్టీకి పెడుతామన్నారు. తెలంగాణ సాధికారిత సాధించాలంటే మెరుగైన, నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం ప్రజలకు అందాలని అన్నారు. యువతకు ఉద్యోగాలు కల్పించటమే తన ప్రథమ ప్రాధాన్యమని చెప్పారు. ఉద్యోగాలతో పాటు వారికి భద్రత కూడా కల్పించాలన్నారు. సామాజిక న్యాయం కోసం జాగృతి పోరాటం కొనసాగుతుందన్నారు. క్రమంగా జాగృతిని చాలా బలంగా తయారు చేస్తామని చెప్పారు.

ఫీజు రీయింబర్స్ మెంట్ చెల్లించకపోవటంతో లక్షలాది మంది విద్యార్థులు చదువులకు దూరం కావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం ఆడపిల్లల చదువుకు మరణశాసనంగా మారిందన్నారు. ఇక రైతుల ఆత్మహత్యలు చాలా బాధకరమని చెప్పారు. కాంగ్రెస్ వచ్చాక వరుసగా రైతుల ఆత్మహత్యలు కొనసాగటం బాధకరమన్నారు. ప్రభుత్వం చేతగాని, నిర్లక్ష్య వైఖరిని ఇది నిదర్శనమని చెప్పారు. ఇక ఫార్మా సిటీ కోసం తీసుకున్న భూముల్లో ఫ్యూచర్ సిటీ అంటూ హడావుడి చేయటంపై మండిపడ్డారు. తర్వలోనే అక్కడి రైతులకు మద్దతుగా పోరాటం చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ వచ్చాక సింగరేణి సంస్థను తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్ఎంఎస్ తో కలిసి సింగరేణి కోసం ప్రభుత్వం పై పోరాటం చేస్తామన్నారు. హైదరాబాద్ లో ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించకపోవటంపై కవిత ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వెస్ట్ సిటీ పై పెట్టిన శ్రద్ధ, ఈస్ట్ సిటీ ని సిటీ అభివృద్ధి చేయటంలో పెట్టలేదన్నారు. కవిత వ్యక్తిగత అభిరుచులకు సంబంధించి పలువురు నెటిజన్లు ప్రశ్నించారు. రామ్ చరణ్ గురించి ఒక్క మాటలో చెప్పాలని అడగగా...చాలా హంబుల్ గా ఉండే వ్యక్తి. మంచి డ్యాన్సర్ అన్నారు. ఐతే తాను చిరంజీవి అభిమానిని అని...చిరంజీవి తర్వాతే రామ్ చరణ్ అన్నారు. చిన్నప్పుడు ఎర్రమంజిల్ లో గడిపిన క్షణాలు తనకు చాలా సంతోషానిచ్చాయని అన్నారు. ఐతే రాజకీయాలు కాకుండా ఏదైనా బిజినెస్ పై దృష్టి పెట్టాలంటూ ఓ నెటిజన్ సూచించగా... అందుకు కవిత కూల్ గా అన్సర్ చేశారు. సోషల్ మీడియాలో ఇలాంటి చాలా నెగిటివిటీ ఉంటుందని దాన్ని పట్టించుకోకుండా మంచిగా ఆలోచించాలని సూచించారు.

# కాంగ్రెస్.. డేంజర్ బెల్స్!

- పంచాయతీ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి ఊరటనిచ్చాయి
- కానీ అంతర్లీనంగా తీవ్రమైన హెచ్చరికలను జారీ చేశాయి
- అధికారంలో ఉన్న పార్టీకి ఏకపక్ష విజయాలు దక్కడం పరిపాటి
- పథకాలు అధికార పార్టీ వారికే దక్కుతాయని మొగ్గు చూపుతారు
- కాంగ్రెస్ పార్టీ సుమారు 50 శాతం స్థానాల్లో విజయం సాధించింది
- బీఆర్ఎస్ 40 శాతానికి పైగా స్థానాల్లో గెలుపొందడం గమనార్హం
- కాంగ్రెస్‌కి ఈ ఎన్నికలు అతిపెద్ద ఆందోళన మిగాల్చాయి
- రాష్ట్రంలో చక్రం తిప్పుతున్నామన్న నేతలు ఘోరంగా ఓడిపోయారు
- అలానే సోమార్‌పేటలో కాంగ్రెస్ బలపరిచిన దారుణానికి పాల్పడ్డాడు
- ఇప్పటికైనా లోపాలను సరిదిద్దుకోకపోతే మూల్యం చెల్లించుకోక తప్పదు

**తెలంగాణ వ్యాప్తంగా జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాలు అధికార కాంగ్రెస్ పార్టీకి ఊరటను ఇస్తూనే, అంతర్లీనంగా తీవ్రమైన హెచ్చరికలను కూడా జారీ చేశాయి. ఇప్పటివరకూ వెలువడిన రెండు విడతల ఫలితాలను పరిశీలిస్తే, అత్యధిక స్థానాలను కైవసం చేసుకుని కాంగ్రెస్ అగ్రస్థానంలో నిలిచిన మాట వాస్తవమే. కానీ, క్షేత్రస్థాయిలో చోటుచేసుకున్న పరిణామాలు, గణాంకాలను లోతుగా విశ్లేషిస్తే.. అధికార పార్టీ సాధించిన ఈ విజయం బలుపు కాదని, కేవలం వాపు మాత్రమేనన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. సాధారణంగా ఏ రాష్ట్రంలోనైనా అధికారంలో ఉన్న పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకపక్ష విజయాలు దక్కడం పరిపాటి. అభివృద్ధి నిధులు, ప్రభుత్వ పథకాలు అధికార పార్టీ మద్దతుదారులకే అందుతాయన్న నమ్మకంతో గ్రామీణ ఓటర్లు అధికార పక్షం వైపు మొగ్గు చూపుతారు.**

**చట్టం, స్టేట్ బ్యూరో:**

ఈ కోణంలో చూస్తే కాంగ్రెస్ పార్టీ స్వీప్ చేయాల్సి ఉంది. కానీ, తాజా ఫలితాలు ఆ అంచనాలను తారుమారు చేశాయి. కాంగ్రెస్ పార్టీ సుమారు 50 శాతం స్థానాల్లో విజయం సాధిస్తే, ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ 40 శాతానికి పైగా స్థానాల్లో గెలుపొందడం గమనార్హం. కేవలం 10 శాతం ఓట్ల తేడా మాత్రమే ఉండటం అధికార పార్టీ డొల్లతనాన్ని బయటపెడుతోంది. కాంగ్రెస్ విజయం వెనుక ఆ పార్టీ సంస్థాగత బలం కంటే, 'అధికారంలో ఉన్నాం' అన్న సానుకూలత మాత్రమే ఎక్కువగా పని చేసిందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఒకవేళ కాంగ్రెస్ అధికారంలో లేకపోయి ఉంటే, ఈ ఫలితాలు పూర్తిగా భిన్నంగా ఉండేవని అంచనా వేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికలు మిగిల్చిన అతిపెద్ద ఆందోళన.. మంత్రులు, ఎమ్మెల్యేల పనితీరు. రాష్ట్రంలో చక్రం తిప్పుతున్నామని భావిస్తున్న పలువురు మంత్రులు, కీలక ఎమ్మెల్యేల సొంత గ్రామాలు, సొంత నియోజకవర్గాల్లోనే కాంగ్రెస్ మద్దతుదారులు ఓటమి పాలయ్యారు. అధికార పార్టీ నేతలు తమ సొంత గడ్డపైనే పట్టు కోల్పోవడం, అక్కడ బీఆర్ఎస్ మద్దతుదారులు జెండా ఎగురవేయడం కాంగ్రెస్ అధిష్టానానికి మింగుడుపడని విషయం. ఇది కేవలం ఓటమి మాత్రమే కాదు, క్షేత్రస్థాయిలో నాయకత్వంపై ప్రజల్లో ఉన్న అసంతృప్తికి నిదర్శనం. నేతల అతి విశ్వాసం, గ్రూపు తగాదాలు, క్షేత్రస్థాయి కార్యకర్తలను విస్మరించడం వంటి కారణాలే ఈ ఫలితాలకు దారితీశాయని స్పష్టమవుతోంది.

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఓటముల తర్వాత డీలా పడ్డ బీఆర్ఎస్ శ్రేణులకు ఈ పంచాయతీ ఎన్నికలు టానిక్‌లా పనిచేశాయి. ప్రతిపక్షంలో ఉండి, అధికార పార్టీని ఎదుర్కొని మరీ 40 శాతానికి పైగా స్థానాలను దక్కించుకోవడం ఆషామాషీ విషయం కాదు. గ్రామీణ స్థాయి క్యాడర్ బీఆర్ఎస్‌కు ఇంకా బలంగానే ఉందని ఈ ఫలితాలు రుజువు చేశాయి. కాంగ్రెస్ వైఫల్యాలను, ప్రభుత్వ వ్యతిరేకతను ఓట్లుగా మలుచుకోవడంలో బీఆర్ఎస్ స్థానిక నాయకత్వం సఫలమైంది.

ఈ ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి కచ్చితంగా ఒక మేలుకొలుపు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటుతున్నా, క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టతపై దృష్టి సారించకపోవడం,





నేతల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటికిప్పుడు జనం ప్రభుత్వంపై పూర్తి వ్యతిరేకతతో లేకపోయినా, ఈ ఫలితాలు మాత్రం భవిష్యత్తు రాజకీయాలకు ప్రమాద ఘంటికలే. ముఖ్యంగా స్థానిక సంస్థల్లో ప్రతిపక్షం బలంగా ఉంటే, అది ప్రభుత్వ పథకాల అమలులోనూ, వచ్చే ఎన్నికల్లోనూ అధికార పార్టీకి పెద్ద తలనొప్పిగా మారుతుంది.

టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డికి సొంతగడ్డపైనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆమె స్వగ్రామమైన తొర్రూరు మండలం చెర్లపాలెంలో ఆమె బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి ఓటమి పాలయ్యారు. ఇక్కడ కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత విభేదాలు రచ్చకెక్కాయి. ఝాన్సీరెడ్డి అధికారికంగా బలపరిచిన అభ్యర్థి కిరణ్‌పై.. రెబల్ నేత, తొర్రూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ తిరుపతి రెడ్డి వర్గానికి చెందిన మహేందర్ ఘన విజయం సాధించారు. ఝాన్సీరెడ్డి అభ్యర్థి ఓడిపోవడంతో గ్రామస్తులు, తిరుపతి రెడ్డి వర్గీయులు బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా తిరుపతి రెడ్డి మాట్లాడుతూ.. ఝాన్సీరెడ్డి తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. ఆమె నియంతృత్వ పోకడల వల్ల అసలైన కాంగ్రెస్ కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆమె తన ఒంటెద్దు పోకడలు మాని, తీరు మార్చుకోవాలని హితవు పలికారు. సొంతూరులో రెబల్ అభ్యర్థి గెలుపు ఝాన్సీరెడ్డికి మింగుడు పడని అంశంగా మారింది. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం సోమార్‌పేట గ్రామంలో గ్రామ సర్పంచ్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి పాపయ్య విజయం సాధించిన వెంటనే, ఆయన సోదరుడు చిరంజీవి గ్రామంలో వీరంగం సృష్టించాడు. తమపైనే పోటీ చేశారనే కక్షతో చిరంజీవి ప్రత్యర్థి అభ్యర్థి రాజు కుటుంబంపై ఏకంగా ట్రాక్టర్‌తో దాడికి పాల్పడ్డాడు. ఈ దారుణ సంఘటనలో బాలమణి, భారతి, సత్తవ్వ, శారదలకు తీవ్ర గాయాలయ్యాయి, వారి పరిస్థితి విషమంగా ఉండటంతో తక్షణమే హైదరాబాద్‌కు తరలించారు.

ఈ అమానుష దాడికి నిరసనగా బాధితులు, గ్రామస్థులు ఎల్లారెడ్డిలో పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. ఈ దాడికి వ్యతిరేకంగా గ్రామస్థులంతా ఏకమై ఎల్లారెడ్డి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కురుమ సాయిబాబా రాజీనామా చేయాలని ప్రధానంగా డిమాండ్ చేస్తూ, ఎల్లారెడ్డిబాన్స వాడ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ప్రస్తుతం సోమార్పేట గ్రామంలో పోలీసులు భారీగా మోహరించి పికెటింగ్ ఏర్పాటు చేశారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, సర్పంచ్ పదవికి రాజీనామా చేయించాలని ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారు, దీంతో పరిస్థితి ఇంకా ఉద్రిక్తంగానే కొనసాగుతోంది. మొత్తానికి, కాంగ్రెస్ సాధించిన ఈ విజయం అంకెల గారడీలో గొప్పగా కనిపించవచ్చు కానీ, వాస్తవంలో అది నిలకడ లేని విజయమని, పార్టీ ఇప్పటికైనా లోపాలను సరిదిద్దుకోకపోతే రానున్న రోజుల్లో మూల్యం చెల్లించుకోక తప్పదని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# సర్పంచ్‌లను వేధిస్తే తాట తీస్తా

- తెలంగాణలో సర్పంచ్ ఎన్నికలు కాకరేపుతున్నాయి
- కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్‌ల మధ్య మాటల యుద్ధం
- ఈ నేపథ్యంలో కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు
- సర్పంచ్ లను వేధిస్తే తాట తీస్తామంటూ వార్నింగ్
- ప్రతి జిల్లాలో 'లీగల్ సెల్' ఏర్పాటు చేస్తామన్నారు
- కాంగ్రెస్ పై వ్యతిరేకత స్పష్టంగా తెలుస్తోందన్నారు

**చట్టం, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో ప్రస్తుతం సర్పంచ్ ఎన్నికలు కాకరేపుతున్నాయి. ముఖ్యంగా ఈ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్‌ల మధ్య మాటల యుద్ధం నడుస్తుంది. నువ్వా నేనా అన్న విధంగా నేతలు మాటల తూటాలు పేల్చుకుంటున్నారు. ఇదిలా ఉండగా.. ఇటీవల తెలంగాణల రెండు విడతల్లో ఎన్నికలు జరిగాయి. పలు చోట్ల బీఆర్ఎస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులు కూడా విజయాన్నిసాధించారు. కాంగ్రెస్ పార్టీకు పరాభవాన్ని మిగిల్చారు. అయితే.. కొన్ని చోట్ల మాత్రం గెల్చిన బీఆర్ఎస్ నుంచి బరిలో నిలిచిన వారిపై దాడులు, ఒకవేళ గెల్చిన కూడా వారిని ఏదో విధంగా పక్కకు తప్పుకునేలా వేధింపులకు గురిచేస్తున్న ఘటనలు పలుచోట్ల వెలుగులోకి వస్తున్నాయి. దీనిపై తాజాగా.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కీలక వ్యాఖ్యలు చేశారు.

సర్పంచ్‌లను వేధిస్తే తాట తీస్తామంటూ కాంగ్రెస్ ను ఏకీపారేశారు. ఇక మీదట తెలంగాణలో సర్పంచ్‌లను వేధిస్తే ఊరుకోమన్నారు. అదే విధంగా ప్రతి జిల్లాలో 'లీగల్ సెల్' ఏర్పాటు చేస్తామన్నారు. కాంగ్రెస్ బెదిరింపులకు భయపడొద్దన్నారు. అన్ని విధాలుగా న్యాయపరంగా అండగా ఉంటామన్నారు. రెండెళ్లలోనే కాంగ్రెస్ పై వ్యతిరేకత స్పష్టంగా తెలుస్తోందన్నారు. ఈ క్రమంలో కేటీఆర్.. సిరిసిల్లలో నూతన సర్పంచులకు దిశానిర్దేశం చేశారు. కొత్తగా



ఎన్నికైన సర్పంచులను ఇబ్బంది పెట్టాలని చూస్తే సహించేది లేదని తెల్చి చెప్పారు. సర్పంచ్ లు, అభ్యర్థుల రక్షణ కోసం ప్రతి జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ తరఫున ప్రత్యేక న్యాయ విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నామని కేటీఆర్ ప్రకటించారు. ఈ సందర్భంగా గెలిచిన అభ్యర్థులను అభినందిస్తూ, వారికి భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. ప్రతి జిల్లాలో సర్పంచుల కోసం లీగల్ సెల్ ఏర్పాటు చేస్తామన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో గెలిచిన బిఆర్ఎస్ మద్దతుదారులు కాంగ్రెస్ పార్టీ బెదిరింపులకు భయపడవద్దని కేటీఆర్ భరోసా ఇచ్చారు. "మిమ్మల్ని సస్పెండ్ చేస్తాం, ఇబ్బంది పెడతాం అని ఎవరైనా అధికారులు గానీ, పాలకపక్ష నేతలు గానీ బెదిరిస్తే ఒక్క క్షణం కూడా ఆలోచించకండి. వెంటనే పార్టీని సంప్రదించాలన్నారు. మీ కోసం ప్రతి జిల్లాలో లీగల్ సెల్ ఏర్పాటు చేస్తున్నాం. అరగంటలో పార్టీ యంత్రాంగం మీకు అండగా నిలుస్తుందన్నారు. కోర్టు ద్వారా మన హక్కుల కోసం కొట్లాడుదామని కేటీఆర్ స్పష్టం చేశారు. రాజ్యాంగ బద్ధంగా గ్రామాలకు రావాల్సిన ఫైనాన్స్ కమిషన్ నిధులను ఎవరూ ఆపలేరని, ఆ నిధులు సాధించుకునే బాధ్యత తాము తీసుకుంటామని హామీ ఇచ్చారు. అంబేద్కర్ రాజ్యాంగం ప్రకారం గ్రామాలకు కావాల్సిన నిధులను ఎవరు కూడా ఆపలేరని కేటీఆర్ అన్నారు.

# శంషాబాద్ ఆర్.జి.ఐ.ఏ ఇన్స్పెక్టర్ సంజీవ కు ఘనంగా సన్మానం

- **పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన సిపిఐ నాయకులు!**



**చట్టం, శంషాబాద్:** శంషాబాద్ ఆర్.జి.ఐ.ఏ పోలీస్ స్టేషన్ కి నూతనంగా హౌస్ ఇన్స్పెక్టర్ గా పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సోమవారం వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఇన్స్పెక్టర్ సంజీవ కు శాలువాతో సత్కరించి మర్యాదపూర్వకంగా కలిసిన సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, పానుగంటి పర్వతాలు, కార్యవర్గ సభ్యులు యాదగిరి, మండల కార్యదర్శి నరగిరి, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు అన్యపు ప్రభువు ముదిరాజ్, రైతు సంఘం నాయకుడు శివారెడ్డి గీత, రాజేందర్ గౌడ్, ప్రవీణ్ గౌడ్, తదితరులు కలిశారు. అనంతరం ఇన్స్పెక్టర్ సంజీవ మాట్లాడుతూ... శంషాబాద్ పట్టణంలో అందరూ కలిసిమెలిసి ఉండాలని శాంతిభద్రతలకు అందరూ సహకరించాలని మద్యం సేవించి వాహనాలు నడపకూడదు, ఆన్లైన్ సైబర్ మోసగాల వలలో పడకూడదని ఎవరైనా అనుమానస్పదంగా కనిపిస్తే మాకు సమాచారం ఇవ్వాలని అన్నారు.

# ఉచిత నేత్ర పరీక్షలు




**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని యోగేశ్వర కాలనీలో గల జెంటిల్ కిడ్స్ ప్లే స్కూల్ యందు స్నేహ లేజర్ అండ్ ఐ హాస్పిటల్ హౌసింగ్ బోర్డ్ వారి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య పరీక్షల క్యాంప్ విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు, వారి తల్లిదండ్రులు సకుటుంబ సమేతంగా వచ్చి క్యాంపును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ స్నేహ, మాట్లాడుతూ పిల్లల యొక్క దృష్టి లోపం ఎక్కువ శాతం లో మందగిస్తున్నది అన్నారు. దీనికి కారణం ఈరోజుల్లో మొబైల్స్ ముఖ్య కారణంగా అనుకుంటున్నారు. ఈ క్యాంప్ లో దాదాపు 150 మంది స్కూల్ పిల్లలు వారి తల్లిదండ్రులతో సహా ఐ క్యాంపును వినియోగించుకుని వారి యొక్క దృష్టిలోపాలను సరి తేలుసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ గుజరాతి ప్రకాష్, ప్రిన్సిపాల్ లత, ఇంచార్జ్ స్వప్న, సంగీత, రజిత తదితరులు పాల్గొన్నారు.

# ఆర్మూర్ డివిజన్‌లో 163 BNSS సెక్షన్ అమలు: సీపీ ఆదేశాలు



**చట్టం నిజామాబాద్:** నిజామాబాద్ జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల (ఫేజ్3) సందర్భంగా శాంతిభద్రతల నిర్వహణ కోసం ఆర్మూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలో సెక్షన్ 163 BNSS అమలులో ఉంటుందని పోలీస్ కమీషనర్ పి. సాయి చైతన్య ప్రకటించారు. డిసెంబర్ 17, 2025 ఎన్నికల రోజున ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమికూడటంపై నిషేధం విధించారు. ఈ ఉత్తర్వులు డిసెంబర్ 15, ఉదయం 05:00 గంటల నుండి డిసెంబర్ 18, సాయంత్రం 05:00 గంటల వరకు అమలులో ఉంటాయి. ఆర్మూర్, ఆలూర్, బాల్కొండ, భీంగల్, డొంకేశ్వర్, కమర్‌పల్లి, మెండోరా, మోర్తాడ్, ముప్కాల్, నందిపేట్, వేల్పూర్, ఏర్గట్ల మండలాల్లో ఈ ఆదేశాలు వర్తిస్తాయి. అనుమతి లేకుండా గుమికూడిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

# ధర్పల్లి గ్రామ ప్రజల రుణం తీర్చుకోలేనిది



**చట్టం ధర్పల్లి;** ధర్పల్లి గ్రామ ప్రజలు తనను అక్కున చేర్చుకొని భారీ మెజార్టీతో సర్పంచిగా గెలిపించారని, వారి రుణం తీర్చుకోలేనిదని ధర్పల్లి గ్రామ సర్పంచ్ గా గెలుపొందిన చెలిమెల శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కృతజ్ఞత సమావేశంలో మండల అధ్యక్షుడు చిన్న బాలరాజ్ ,కాంగ్రెస్ నాయకులు సర్పంచ్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ శ్రీకాంతులను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆశీర్వాదంతో తన పార్టీ నాయకులతో ధర్పల్లి గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించి ప్రజల రుణం తీర్చుకుంటానని, ఉద్వేగ భరితంగా అన్నారు. గ్రామ ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి ఒక్క హామీ నెరవేరుస్తానని, ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సింగల్ విండో చైర్మన్ చిన్నారెడ్డి,సిహెచ్. నరసయ్య, ఎం గంగారెడ్డి, గాదరి మనోహర్ రెడ్డి, సురేందర్ గౌడ్, అబ్దుల్ హమీద్ మంగిత్య, సిహెచ్. గంగాధర్,

# తల్వేద అభివృద్ధి పథంలోకి మారాలంటే, నాయకత్వం మారాలి!.

- **సర్పంచ్ అభ్యర్థి గడచంద హరిత, కత్తెర గుర్తు**




**చట్టం ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలోని నందిపేట్ మండలం తల్వేద గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికలలో గడచంద హరిత శ్రీకాంత్, కత్తెర గుర్తుతో పోటీ చేస్తున్నారు. తల్వేద గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి జిల్లాలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తన ధ్యేయమని స్పష్టం చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి ఒక్క సంక్షేమ పథకం గ్రామానికి సక్రమంగా తీసుకువచ్చి, అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా పారదర్శకంగా అమలు చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా బడుగు బలహీన వర్గాల సంక్షేమమే తన ప్రథమ ప్రాధాన్యం అని తెలిపారు. గ్రామంలో రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం, డ్రైనేజీ, వీధిదీపాలు, విద్య, ఆరోగ్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని, తల్వేద గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తానని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి కోసం తనకు ఒక అవకాశం ఇవ్వాలన్నారు. కత్తెర గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని తల్వేద గ్రామ ప్రజలను గడచంద హరిత పాదాభివందనాలతో వినమ్రంగా కోరారు.

# మూడవ విడత ఎన్నికలను సమన్వయముతో నిర్వహించండి

- **జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతీక్ జైన్**



**చట్టం వికారాబాద్ ప్రతినిధి :** మొదటి, రెండవ విడత ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించినట్లే మూడవ విడత ఎన్నికల్లో వివిధ శాఖల అధికారులు సమన్వయముగా పని చేసి పూర్తి చేయాలనీ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. ఈ నెల 17 వ తేదీన మూడవ విడత ఎన్నికలు జరిగే పరిగి, కుల్కచర్ల, పూడూర్, చౌడాపూర్, దోమ, మండలాల్లో చేయాల్సిన ఏర్పాట్ల పైన అదనపు కలెక్టర్ లు లింగ్యా నాయక్, సుధీర్, ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి మండల స్పెషల్ అధికారులు, ఎం పి డి ఓ లు, తహసీల్దార్ లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ హాలునుండి మీటింగ్ ద్వారా రివ్యూ చేసి డిస్ట్రిబ్యూషన్ సెంటర్, పోలింగ్, కౌంటింగ్ మొదలగు అంశాల మీద దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ లో మెటీరియల్ పంపిణి ప్రణాళిక ప్రకారం సరిగ్గా జరగాలన్నారు. పి ఎస్ వారీగా మెటీరియల్ నెంబర్ ప్రకారం ఉండాలని, పోలింగ్ అధికారులకు నాణ్యమైన ఆహారం, తదితర సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు.పోలింగ్ కేంద్రాలలో అన్ని మౌలిక వసతులు ఉండేలా చూడాలన్నారు. కౌంటింగ్ వేగవంతం అయ్యేందుకు సరిపడే సిబ్బందిని ఏర్పాటుచేసుకోవాలన్నారు.ఉదయమే డిస్ట్రిబ్యూషన్ సెంటర్ కు చేరుకోవాలని, పోలింగ్ స్టేషన్ వారీగా మెటీరియల్ చెక్ చేసుకొని తీసుకోవాలని, మధ్యాహ్నం భోజనం అనంతరం పోలింగ్ స్టేషన్ లకు చేరుకోవాలన్నారు. పోలింగ్ రోజే ఉప సర్పంచ్ ఎన్నిక కూడా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్, కౌంటింగ్ కి సంబందించిన రిపోర్ట్ లన్ని నిర్దేశిత సమయంలో ఫార్మాట్ లకు తగ్గట్టుగా టి పోల్ లో సబ్మిట్ చేయాలన్నారు. ఎట్టి పరిస్థితిలో రీ కౌంటింగ్ చేయరాదని, సరియైన పద్ధతిలో కౌంటింగ్ జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. నోడల్ అధికారులు, ఆర్డీ ఓ, తహసీల్దార్ లు, ఎంపీడీఓ లు, పోలీస్ అధికారులు, మండల స్పెషల్ అధికారులు, జోనల్ ఆఫీసర్ లు, ఆర్వో లు, పి ఓ లు, ఓపిఓ లు, మైక్రో అబ్జర్వర్ లు, వివిధ శాఖలకి చెందిన అధికారులు సమన్వయముగా పని చేసి మూడవ విడత ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా కృషి చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డి ఆర్ డి ఓ శ్రీనివాస్, డి ఆర్ ఓ మంగీ లాల్, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, నోడల్ అధికారులు తదితరులు ఉన్నారు.

# సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయ దుందుభి–నగేష్ రెడ్డి

- **రెండో విడతలో 137 స్థానాలు కైవసం**
- **సంక్షేమం, అభివృద్ధిపై ఉన్న విశ్వాసానికి నిదర్శనం**



**చట్టం నిజామాబాద్:** నిజామాబాద్ జిల్లాలో జరిగిన సర్పంచ్ ఎన్నికల రెండో విడతలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలిచి ముందంజలో ఉందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కె. నగేష్ రెడ్డి ప్రకటించారు. మొదటి విడత ఎన్నికల్లో మాదిరిగానే రెండో విడతలో కూడా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను ప్రజలు గెలిపించారని ఆయన తెలిపారు. రెండో విడతలో మొత్తం 196 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరగగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు దాదాపు 137 స్థానాలను కైవసం చేసుకున్నారు. ఈ స్థానాల్లో దాదాపు సగం స్థానాలు ఎన్నికలకు ముందే కాంగ్రెస్ అభ్యర్థులకు ఏకగ్రీవం అయ్యాయి.

**ప్రభుత్వంపై ప్రజల విశ్వాసం**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధిని చూసే ప్రజలు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించారని నగేష్ రెడ్డి అన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా రాష్ట్రంలో ప్రజాపాలన ఎంత విజయవంతంగా ఉందో ప్రజలు ఏ విధంగా కాంగ్రెస్ పార్టీ పక్షాన ఉన్నారో తెలపడానికి ఈ ఎన్నికల ఫలితాలే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉంచిన నమ్మకాన్ని నెరవేర్చే విధంగా ప్రతి గ్రామాన్ని అభివృద్ధిలో ముందు ఉంచుతామని డీసీసీ అధ్యక్షుడు హామీ ఇచ్చారు. ఈ ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులకు అభినందనలు తెలుపుతూనే ఇందుకు సహకరించిన కాంగ్రెస్ నాయకులకు, ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# తొండకూరు అభివృద్ధికి ధైర్యమైన నాయకత్వం

- **ఉంగరం గుర్తు సర్పంచ్ అభ్యర్థి అల్లారి గంగాధర్ (శక్కర్ రెడ్డి).**



**చట్టం ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలోని డొంకేశ్వర్ మండలం తొండకూరు గ్రామపంచాయతీ ఎన్నికలలో అల్లారి గంగాధర్, (శక్కర్ రెడ్డి) సర్పంచ్ అభ్యర్థిగా ఉంగరం గుర్తుతో పోటీ చేస్తున్నారు. గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలను సక్రమంగా అమలు చేసి, తొండకూరు గ్రామాన్ని నిజామాబాదు జిల్లాలోనే ఒక ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. బడుగు బలహీన వర్గాలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇతర ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో ప్రతి ఒక్కరి సలహాలు, సహాయ సహకారాలను స్వీకరించి ప్రజలతో కలిసి పాలన సాగిస్తానని పేర్కొన్నారు. గ్రామానికి సేవ చేసే అవకాశం ఇస్తే, ఒక సైనికుడిలా గ్రామ బాధ్యతలను భుజస్కందాలపై వేసుకొని అభివృద్ధి పథంలో గ్రామాన్ని ముందంజలో నడిపిస్తానని ధీమా వ్యక్తం చేశారు. గ్రామం వెనుకబడిపోకుండా నిరంతరం అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని అన్నారు. యువతకు మంచి కార్యక్రమాలు, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటానని, గ్రామాన్ని భవిష్యత్తు వైపు నడిపిస్తానని తెలిపారు. గ్రామంలో సొసైటీ గోదాం నిర్మాణానికి తన సొంత భూమిని కూడా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానన్నాడు. గ్రామాభివృద్ధి కోసం తనకు ఒక అవకాశం ఇవ్వాలని, ఉంగరం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని తొండకూరు గ్రామ ప్రజలందరికీ ఆయన పాదాభివందనాలతో వినమ్రంగా కోరుతున్నారు.

# లక్కంపల్లి అభివృద్ధికి చదువుకున్న నాయకత్వం

- **సర్పంచ్ అభ్యర్థి బరిలో సౌదరి సాగర్**



**చట్టం ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలోని నందిపేట్ మండలం లక్కంపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికలలో సౌదరి సాగర్, ఫుట్ బాల్ గుర్తుతో సర్పంచ్ అభ్యర్థిగా గ్రామ ప్రజల ముందుకు వచ్చారు. పట్టభద్రుడిగా, ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న వ్యక్తిగా గ్రామ సమస్యలను సమగ్రంగా తెలిసిన నాయకుడిని అని తెలిపారు. మహిళా సంఘాలకు ప్రోత్సాహం, స్వయం సహాయక సంఘాల బలోపేతం, అలాగే నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి మార్గదర్శనం తన ప్రధాన లక్ష్యమని వెల్లడించారు. గ్రామ యువతకు వచ్చే ప్రతి అవకాశాన్ని లక్కంపల్లికి తీసుకువచ్చేలా కృషి చేస్తానని అన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి ఒక్క సంక్షేమ పథకం ప్రజలందరికీ చేరేలా పారదర్శకంగా అమలు చేస్తానని, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, పెన్షన్లు, రేషన్, ఇతర సంక్షేమ పథకాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని హామీ ఇచ్చారు. గ్రామానికి ఎక్కువ మొత్తంలో నిధులు తీసుకువచ్చి రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం, డ్రైనేజీ, వీధిదీపాలు, హరితహారం వంటి పనులతో గ్రామాన్ని సర్వాంగ సుందరంగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని అన్నారు. తనను భారీ మెజార్టీతో గెలిపిస్తే, బడుగు బలహీన వర్గాలందరినీ కలుపుకొని లక్కంపల్లి గ్రామాన్ని నిజామాబాద్ జిల్లాలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధి కోసం తనకు ఒక అవకాశం ఇవ్వాలని, ఫుట్ బాల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని లక్కంపల్లి గ్రామ ప్రజలందరినీ ఆయన పాదాభివందనాలతో వినమ్రంగా కోరుతున్నారు.

# వంచనగిరి పులిబిడ్డ గిరిగిస్తే గురి తప్పదు

**వరంగల్ చట్టం:**

మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు స్థానిక సర్పంచ్ ఎలక్షన్ల సందర్భంగా తన మాటను నిలబెట్టుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు ఇచ్చిన మాట ప్రకారం తన సొంత మండలం గీసుగొండలో సత్తా చాటారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సర్పంచులను, వార్డ్ మెంబర్లను సన్మానించి అభినందించిన తెలియజేశారు.



# అంకన్నగూడెం పంచాయతీలో 'పల్లె పల్లెకు ఎమ్మెల్యే చిర్రి అన్నా' కార్యక్రమం



**చట్టం జీలుగుమిల్లి :** జీలుగుమిల్లి మండలం అంకన్నగూడెం పంచాయతీలో 'పల్లె పల్లెకు ఎమ్మెల్యే చిర్రి అన్నా' కార్యక్రమాన్ని పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు సోమవారం అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్థులను ఉద్దేశించి మాట్లాడిన ఎమ్మెల్యే, గ్రామస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి శాశ్వత పరిష్కారాలు అందించడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి ప్రభుత్వ పథకాలు, మౌలిక వసతులు సమానంగా చేరేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను ప్రత్యక్షంగా వినడం ద్వారా పాలన మరింత పారదర్శకంగా మారుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాభివృద్ధి, త్రాగునీరు, రహదారులు, పారిశుధ్యం, విద్యుత్, ఉపాధి వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో భాగంగా అంకన్నగూడెం పంచాయతీ పరిధిలోని ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను ఎమ్మెల్యేకు సమర్పించారు. వాటిని స్వీకరించిన ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. అనంతరం గ్రామంలో యువతను క్రీడల వైపు ప్రోత్సహించాలనే ఉద్దేశంతో క్రీడాకారులకు వాలీబాల్ కిట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. క్రీడలు యువతలో ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణను పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శులు కరాటం సాయి, గడ్డమనగు రవికుమార్, జనసేన మండల అధ్యక్షులు పసుపులేటి రాము, జీలుగుమిల్లి సొసైటీ అధ్యక్షులు సరిపల్లి సత్యనారాయణ రాజు, కూటమి నాయకులు వెట్టి సింగరాజు, గోపి, శ్రీను, భాష, పద్దం వెంకటకృష్ణ, నాలి శ్రీను, కోలా మధు తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలి

**ఎస్సై మోహన్ రెడ్డి**



**చట్టం బిచ్కుంద :** బిచ్కుంద మండల ప్రజలందరికీ పోలీసువారి ముఖ్య సూచనలు ఏమనగా రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులందరూ మరియు ప్రజలందరూ ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు సజావుగా జరిగేందుకు పోలీసు వారికి సహకరించగలరని కోరుతున్నాము. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికలలో ఎవరు ఎన్నికల కోడ్ ను ఉల్లంఘించరాదని ఉల్లంఘించు వారిపైన కఠిన చర్యలు తీసుకోబడును .అవాంఛనీయ సంఘటనలు గొడవలు ఏమి జరగకుండా ప్రజలందరూ సామరస్యపూర్వకంగా స్నేహ భావంతో ఎన్నికలలో పాల్గొని ఓటు హక్కును అందరూ వినియోగించుకొని తనకు నచ్చిన అభ్యర్థులకి ఓటు వేసుకోవాలని కోరుతున్నాము. ఓటు వేసే ఓటర్లు పోలింగ్ బూత్ లోకి లోపలికి మొబైల్ ఫోన్స్ ,కెమెరాస్ ,బ్యాగ్స్ ,మ్యాచ్ బాక్స్ ,ఇంక్ పెన్సిల్ లాంటివి తీసుకెళ్లకూడదు 100 మీటర్ల లైన్ దాటుకుని ఎవరు కూడా బైకుల పైన కానీ ఇతర వాహనాల పైన కానీ రాకూడదు ఓటు వేసే అభ్యర్థులు మాత్రమే 100 మీటర్ల లైను దాటుకుని ప్రశాంతమైన వాతావరణం లో ఓటు వేసుకొని వెళ్లగలరు ప్రశాంతమైన వాతావరణంలో ప్రజాస్వామ్యబద్ధంగా జరగబోయే ఎన్నికల్లో ప్రజలందరూ పోలీసువారి సూచనలు తప్పకుండా పాటించగలరని కోరుతున్నాము గెలిచిన అభ్యర్థులు ఎలక్షన్ కోడ్ ను విధిగా పాటిస్తూ విజయోత్సవ ర్యాలీలు ఎవరు తీయరాదు తీసినచో చట్టపరమైన చర్యలు తీసుకోబడును అని ఎస్ఐ మోహన్ రెడ్డి తెలిపారు.




# పెన్షనర్ల క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ధన్ పాల్

▶ **విశ్రాంత ఉద్యోగుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం**





**చట్టం ఇందూరు:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నిజామాబాద్ జిల్లా శాఖ ఆహ్వానం మేరకు, అఖిల భారత పెన్షనర్స్ డే సందర్భంగా నిజామాబాద్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల క్రీడా పోటీలు 2025 ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఇందూరు అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్ర అభివృద్ధికి జీవితకాలం సేవలు అందించిన పెన్షనర్లను నేటి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ఆయన ఆరోపించారు. పెన్షన్ల బకాయిలు, వైద్య సౌకర్యాలు, ఆరోగ్య బీమా, డీఏ బకాయిలు వంటి మౌలిక సమస్యలు సంవత్సరాలుగా పెండింగ్‌లోనే ఉన్నాయని వాటి పరిష్కారంపై ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని ఆయన విమర్శించారు. విశ్రాంత ఉద్యోగులు భిక్ష అడిగే స్థితికి కాకుండా గౌరవప్రదమైన జీవితం గడపాల్సిన హక్కు ఉందని ఆయన స్పష్టం చేశారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేగా తాను అసెంబ్లీలోనూ ప్రజల మధ్య ఉండి పెన్షనర్ల హక్కుల కోసం నిరంతరం పోరాడుతానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ప్రజా కార్యక్రమాలకు పరిమితమై పెన్షనర్ల వాస్తవ సమస్యలను పక్కన పెట్టడం దురదృష్టకరంఅని ఆయన విమర్శించారు. ఆరోగ్యం, ఐక్యతను పెంపొందించే ఈ క్రీడా కార్యక్రమాలు ప్రశంసనీయం అయినప్పటికీ వీటితో పాటు పెన్షనర్ల జీవన భద్రతకు ప్రభుత్వం బాధ్యత వహించాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు, బీజేపీ నాయకులు, వివిధ శాఖల ప్రతినిధులు మరియు క్రీడల్లో పాల్గొన్న పెన్షనర్లు పాల్గొన్నారు.

## బాలరాజు పల్లి గ్రామ సర్పంచ్ నేదూరి ప్రేమలత నర్సయ్యకు ఘన సన్మానం



**చట్టం న్యూస్ రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** వేములవాడ మండల రూరల్ పరిధిలోని బాలరాజు పల్లి గ్రామంలో నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ నేదూరి ప్రేమలత నర్సయ్య ఎన్నికైన శుభ సందర్భంగా గ్రామ నాయకులు శాలువతో ఘనంగా సత్కరించారు. గ్రామ ప్రజల ఆశీస్సులు, మద్దతుతో ప్రజాసేవ లక్ష్యంగా ముందుకు సాగుతున్న సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎడపల్లి అనిల్, వంగపల్లి మల్లేశం, కొంపల్లి శ్రీకాంత్, బట్టు ఆంజనేయులు పాల్గొని సర్పంచ్‌ను సాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎడపల్లి అనిల్ మాట్లాడుతూ బాలరాజు పల్లి గ్రామ ప్రజలకు చక్కటి సేవలు అందిస్తూ గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. గ్రామంలో ఎవరికి ఏ ఆపద వచ్చినా ముందువరుసలో నిలబడి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు. ప్రజల విశ్వాసానికి తగినట్లుగా పారదర్శక పాలన అందిస్తూ, గ్రామ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో సర్పంచ్ నాయకత్వం కీలకంగా ఉండాలని కార్యక్రమంలో పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు. ఈ సన్మాన కార్యక్రమం గ్రామ ఐక్యతను, ప్రజాసేవ పట్ల ఉన్న నిబద్ధతను ప్రతిబింబించిందని స్థానికులు తెలిపారు.

## నూతనంగా ఎన్నికైన బాలరాజు పల్లి గ్రామ సర్పంచ్‌కు ఘనంగా సన్మానం



**చట్టం, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** బాలరాజు పల్లి గ్రామంలో నూతనంగా సర్పంచ్‌గా ఎన్నికైన నేదురి ప్రేమలత నరసయ్యకు ఆమె సోదరి దొంతుల సరిత రమేష్ శాలువతో ఘనంగా సన్మానించారు. ఎన్నికైన శుభ సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు హర్షాతిరేకాలతో పాల్గొని నూతన సర్పంచ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దొంతుల సరిత రమేష్ మాట్లాడుతూ, బాబా సాహెబ్ డా. బీఆర్ అంబేద్కర్ ప్రవేశపెట్టిన రిజర్వేషన్ విధానం వల్లే మహిళలకు, వెనుకబడిన వర్గాలకు ప్రజాప్రతినిధులుగా సేవ చేసే అవకాశం లభించిందని పేర్కొన్నారు. ఆ గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రజలందరికీ ముందు వరుసలో నిలిచి నిస్వార్థంగా సేవ చేయాలని నూతన సర్పంచ్‌ను కోరారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రతి ఒక్కరినీ కలుపుకొని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. నూతన సర్పంచ్ నేదురి ప్రేమలత నరసయ్య స్పందిస్తూ, తనపై ప్రజలు ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామ అభివృద్ధి, సంక్షేమ పథకాల సమర్థ అమలు, పారదర్శక పాలనకు ప్రాధాన్యత ఇస్తూ బాలరాజు పల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం గ్రామంలో సానుకూల వాతావరణాన్ని నెలకొల్పుతూ ప్రజల్లో కొత్త ఆశలు రేకెత్తించింది.

## 'పల్లె పల్లెకు ఎమ్మెల్యే చిర్రి అన్నా' కార్యక్రమంలో శాసనసభ్యులు చిర్రి బాలరాజు




**చట్టం జీలుగుమిల్లి :** గ్రామస్థాయిలో ప్రజా సమస్యలు లేకుండా చేయడమే తన ప్రధాన లక్ష్యమని పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామాల సమగ్ర అభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగుదల లక్ష్యంగా ప్రత్యేకంగా చేపట్టిన 'పల్లె పల్లెకు ఎమ్మెల్యే చిర్రి అన్నా' కార్యక్రమంలో భాగంగా ఆయన జీలుగుమిల్లి మండలం రాచన్నగూడెం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై వారి సమస్యలను వినిపించుకోవడం జరిగింది. పంచాయతీ పరిధిలోని గ్రామస్థులు తమ సమస్యలపై ఎమ్మెల్యేకు పిర్యాదులు సమర్పించారు. వాటిని స్వీకరించిన ఎమ్మెల్యే సంబంధిత శాఖ అధికారులతో వెంటనే ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యల పరిష్కారానికి అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ప్రజల సమస్యలకు ఆలస్యం లేకుండా పరిష్కారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. అనంతరం రాచన్నగూడెం, జిల్లెళ్లగూడెం, లంకాలపల్లి గ్రామాలకు చెందిన క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో వాలీబాల్ కిట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. గ్రామీణ యువత క్రీడల వైపు దృష్టి సారించడంతో ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ పెరుగుతుందని, ప్రభుత్వం క్రీడలకు పూర్తి స్థాయిలో మద్దతు ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి కరాటం సాయి, ప్రధాన కార్యదర్శి గడ్డమనగు రవికుమార్, జనసేన మండల అధ్యక్షుడు పసుపులేటి రాము, జీలుగుమిల్లి సొసైటీ అధ్యక్షులు సరిపల్లి సత్యనారాయణ రాజు, కూటమి నాయకులు వనమా వెంకటేశ్వరావు, శివాజీ, కుంజా రమేష్, వీరంకి వెంకటేశ్వరరావు, బండారు అనిల్, బోడపాటి వెంకటేశ్వరావు, కొప్పుల కార్తీక్, గొడుగుల కిరణ్, వీరమల్ల శ్రీను, పేరుబోయిన దాము, బరగడ రాజు, తోట పండు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మానవతా వాదిగా నిరూపించుకున్న మోహన్



**చట్టం రామాయంపేట :** కాంగ్రెస్ పార్టీ నాయకుడు, లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్ తల్లి ఇటీవల స్వర్గస్తులైన విషయం తెలుసుకున్న వెంటనే, కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్యనారాయణలాల్, మోహన్ రెడ్డి, మసూద్ తదితరులు డాక్టర్ మోహన్ నాయక్‌ను ప్రత్యక్షంగా కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన తల్లి గురించి వివరాలు అడిగి తెలుసుకుంటూ, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, సమాజ సేవలో ముందుండే డాక్టర్ మోహన్ నాయక్ కుటుంబానికి ఈ విషాద సమయంలో పార్టీ తరపున పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. వ్యక్తిగత జీవితంలో ఎదురయ్యే కష్టసమయాల్లో పరస్పర సహకారం, మానవతా విలువలే రాజకీయాలకన్నా గొప్పవని పేర్కొన్నారు. ఈ పరామర్శ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని, కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు.

## యెల్దుర్తి, మాసాయిపేట మండలాలలో ఎన్నికల ఏర్పాట్లపై RDO సమావేశం



**చట్టం మెదక్ ప్రతినిధి :** గ్రామ పంచాయతీ ఎన్నికల మూడో దశ నిర్వహణలో భాగంగా ఈ రోజు తూప్రాన్ RDO జయ చంద్రా రెడ్డి యెల్దుర్తి మరియు మాసాయిపేట మండలాలలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఉన్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ ఆఫీసర్లు, జోనల్ ఆఫీసర్లు, పంచాయతీ సెక్రటరీలతో సమావేశం నిర్వహించి, ఎన్నికల నిర్వహణ పై అవగాహన కల్పించారు. పోలింగ్ రోజున ఎలాంటి సమస్యలు రాకుండా అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, అధికారులు-సిబ్బంది అందరూ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పోలింగ్ సామగ్రి పంపిణీ, సిబ్బంది హాజరు, శాంతిభద్రతల అంశాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరగాలంటే ప్రతి ఒక్కరు తమ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలని RDO జయ చంద్రా రెడ్డి పేర్కొన్నారు.

## సోమార్‌పేట్ ఘటనపై కేటీఆర్ ఆరా.. బాధితులకు అండగా ఉండాలని జాజాల సురేందర్ కు ఆదేశం



**చట్టం ప్రతినిధి కామారెడ్డి ;** పంచాయతీ ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థి ఇంటి పై దాడి జరిగిన ఘటన పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరా తీశారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు.

**ఎస్పీ రాజేష్ చంద్ర కి ఫోన్**

ఓడిపోయిన అభ్యర్థి ఇంటిపై గెలిచిన సర్పంచ్ అభ్యర్థి తమ్ముడు అమానుషంగా దాడి చేసిన ఘటన పై తక్షణమే చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్పీ రాజేష్ చంద్రకు స్వయంగా ఫోన్ చేశారు. బాధితులకు రక్షణగా నిలవాలని.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దాడికి పాల్పడిన వారిపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

**అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం**

ఈ సందర్భంగా జాజాల సురేందర్ తో కేటీఆర్ ఫోన్ లో మాట్లాడారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకుని బాధితులకు అండగా ఉండాలని సూచించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

## మూడవ విడత స్థానిక సంస్థల ఎన్నికలకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు



**చట్టం ముస్తాబాద్ :** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో మూడవ విడత స్థానిక సంస్థల ఎన్నికలు ఈ నెల 17న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జరగనున్న నేపథ్యంలో ఎన్నికలు శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ముస్తాబాద్ ఎస్సై గణేష్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని, ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద అవసరమైన భద్రతా ఏర్పాట్లు పూర్తి చేశామని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో భాగంగా ముస్తాబాద్ మండల పరిధిలో 163 BNSS (144 సెక్షన్) అమల్లో ఉండటంతో ఐదుగురికి మించి గుంపులుగా గుమికూడరాదని స్పష్టం చేశారు. అలాగే ఈ నెల 15న సాయంత్రం 5 గంటల నుంచి పోలింగ్ ముగిసే వరకు సైలెంట్ పీరియడ్ అమల్లో ఉంటుందని, ఈ సమయంలో ఎలాంటి ప్రచారం, సభలు, ర్యాలీలు, లౌడ్‌స్పీకర్ల వినియోగం పూర్తిగా నిషేధమని తెలిపారు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో ఎలాంటి ప్రచారం లేదా అడ్డంకులు ఉండరాదని, 200 మీటర్ల పరిధిలో బూత్‌ల ఏర్పాటుకు అనుమతి లేదని, అనుమతితో ఒక్క బూత్ మాత్రమే ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుందని వివరించారు. పోలింగ్ స్టేషన్‌లో లేదా 100 మీటర్ల పరిధిలో మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు నిషేధమని, పోలింగ్ కేంద్రంలోకి గుర్తింపు కార్డు మాత్రమే తీసుకురావడానికి అనుమతి ఉంటుందని తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాలు ఈ నెల 15న సాయంత్రం 5 గంటల నుంచి 18న ఉదయం 10 గంటల వరకు మూసివేయబడతాయని స్పష్టం చేశారు. పోలింగ్ అనంతరం విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించడంపై కూడా నిషేధం ఉంటుందని హెచ్చరించారు. ఎన్నికలు పూర్తిగా శాంతియుతంగా సాగేందుకు ప్రజలు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని ముస్తాబాద్ ఎస్సై గణేష్ కోరారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరిస్తూ, ప్రతి ఓటరు నిర్భయంగా తన ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## శివంపేట సర్పంచిగా గెలిపిస్తే గ్రామాన్ని అన్నివిధాల అభివృద్ధి చేస్తా

**సర్పంచి అభ్యర్థి వరాల గణేష్**



**చట్టం శివ్వంపేట :** మెదక్ జిల్లా శ్ 8వ్వంపేట మండల కేంద్రం కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సర్పంచి అభ్యర్థి వరాల గణేష్ సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ ఇంటింటికి తిరుగుతూ ఉంగరం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. అనంతరం గణేష్ మాట్లాడుతూ ఒక్క సారి అవకాశం ఇచ్చి తనను సర్పంచి గా గెలిపిస్తే గ్రామాన్ని అన్నివిధాల అభివృద్ధి చేస్తా అన్నారు. గ్రామాభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తా అన్నారు. గ్రామంలో అంతర్గత రోడ్లు, డ్రైనేజ్, వీధి దీపాలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. పెన్షన్ రానివారికి పెన్షన్ ఇప్పించడం లాంటి కార్యక్రమాలు చేపడతామన్నారు. అదేవిధంగా త్రాగునిటికోసం మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేస్తూ 6నెలలకు ఒక సారి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. నిరుద్యోగ యువతి యువకులకు ఉపాధి అవకాశం కల్పించనున్నట్లు గణేష్ తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది కావున గ్రామానికి అవసరమైన నిధులు తీసుకొచ్చి గ్రామాన్ని అన్నివిధాల అభివృద్ధి చేస్తా అన్నారు. కావున ఉంగరం గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

## మొదటి విడతలో 88.56%రెండో విడత 88.80 %

▶ **మూడో విడత పోలింగ్ లో మెదక్ జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి**

▶ **జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్**



**చట్టం మెదక్ ప్రతినిధి :** శత శాతం ఓటింగ్లో ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొనాలని, గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ శాతంలో రాష్ట్రంలో 05 స్థానంలో మెదక్ జిల్లా ఉందని, మూడో విడత ఎన్నికలలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు ప్రజలందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రజలందరకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సోమవారం కలెక్టరేట్ కార్యాలయం నుంచి ఒక ప్రకటనలో కలెక్టర్ మాట్లాడుతూ మొదటి, రెండవ విడత ఎన్నికలను ప్రశాంతం గా నిర్వహించినట్లే.. మూడవ విడత ఎన్నికల్లో వివిధ శాఖల అధికారులు సమన్వయముగా పని చేసి పూర్తి చేయాలనీ అన్నారు. ఈ నెల 17 వ తేదీన మూడవ విడత ఎన్నికలు జరిగే మండలాల్లో. నర్సాపూర్, చిలిపిచేడ్, కౌడిపల్లి, కొల్చారం శివంపేట్, వెల్దుర్తి, మాసాయిపేట్ మండలాల్లో అత్యధికంగా ప్రజలు పాల్గొని రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని అన్నారు. మొదటి విడతగా మొదటి విడతలో 88.56% రెండో విడత 88.80 % కలెక్టర్ నమోదయిందని వివరించారు.

## 42 శాతం రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికలు నిర్వహించాలి

▶ **బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు**



**చట్టం భూపాలపల్లి ప్రతినిధి :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పెంచిన తరువాతనే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో ప్రకటించిన స్థానిక సంస్థలలో 42 శాతం బీసీ రిజర్వేషన్ వాగ్దానాన్ని తుంగలో తొక్కి గ్రామపంచాయతీ ఎన్నికలను బీసీలకు 17% రిజర్వేషన్ తోనే నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు తీరని అన్యాయం చేసిందన్నారు. అయినా అనేక జనరల్ స్థానాలలో అగ్రకులాల ఆగడాలను అక్రమాలను బెదిరింపులను ధైర్యంగా ఎదుర్కొని బీసీలు పోటీ చేసి తమ సత్తాచాటడం అభినందనీయమన్నారు. మూడో విడత ఎన్నికలు ముగిసిన తర్వాత జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం సిద్ధమవుతున్నట్టుగా వార్తలు వస్తున్నాయని, అదే నిజమైతే బీసీలకు తీరని ద్రోహం చేసిన వారుగా చరిత్రలో మిగిలిపోతార న్నారు . ఇప్పటికైనా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు శాసనసభ సాక్షిగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు అన్ని రాజకీయ పార్టీల మరియు బీసీ సంఘాల ప్రతినిధులతో అఖిలపక్షాన్ని ప్రధానమంత్రి వద్దకు తీసుకెళ్లి ఒత్తిడి తేవలన్నారు. రాష్ట్రంలోని బిజెపి కేంద్ర మంత్రులు, ఎంపీలు ప్రధానమంత్రితో చర్చించి ఒప్పించాలన్నారు. బీసీనని చెప్పుకునే ప్రధానమంత్రి మోడీ పార్లమెంటు సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ బిల్లులు ఆమోదించి రాజ్యాంగం లోని 9 వ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. లేనిచో బీసీల ఆగ్రహానికి కేంద్ర, రాష్ట్ర పాలకులు, బీసీ వ్యతిరేక పార్టీలు గురికాక తప్పదని వెంకట్రాములు హెచ్చరించారు.

## ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలు – జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే



**చట్టం, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్)ను పకడ్బందీగా, కఠినంగా అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన రోజు నుంచి ఇప్పటి వరకు జిల్లాలో జరిగిన ఉల్లంఘనలపై 11 కేసులు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఎన్నికల సమయంలో అక్రమ మద్యం విక్రయం, రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఆకస్మిక దాడులు నిర్వహించినట్లు పేర్కొన్న ఎస్పీ, ఈ చర్యల్లో భాగంగా 98 కేసులు నమోదు చేసి మొత్తం 1,525 లీటర్ల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే రూ. 23,28,500 నగదును సీజ్ చేయడం జరిగిందని వివరించారు. ఎన్నికల సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులు, గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడిన వారిపై ముందస్తు చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ క్రమంలో 224 కేసుల్లో 782 మందిని బైండోవర్ చేయడం జరిగిందన్నారు. జిల్లాలో స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా పోలీసు శాఖ సమన్వయంతో పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన ఎన్నికల ప్రవర్తన నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, పోలీసులకు పూర్తి సహకారం అందిస్తూ శాంతియుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ప్రజలను కోరారు.

## తల్వేదలో వినయ్ రెడ్డి ప్రచారం

**చట్టం ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలోని నందిపేట్ మండలం తల్వేద గ్రామంలో సోమవారం రోజు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి గాడ్చాంద హరిత శ్రీకాంత్, ని కత్తెర గుర్తుకి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి, ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామ సరిహద్దునుండి భారీ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి తిరుగుతూ కత్తెర గుర్తుకు ఓటు వేసి గెలిపించండి అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అభ్యర్థి, వార్డు సభ్యుల అభ్యర్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# ఎంపీ రఘురాంరెడ్డిని కలిసిన పాల్వంచ కాంగ్రెస్ నేతలు



**చట్టం న్యూస్ ,భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి :** ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డిని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు నాయకత్వంలో పాల్వంచ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల పాల్వంచ మండలం పరిధిలోని 17 గ్రామపంచాయతీలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించిన నేపథ్యంలో, ఈ విజయాన్ని ఎంపీకి వివరించి అభినందనలు తెలియజేయడానికి నాయకులు ఈ భేటీకి హాజరయ్యారు. ఈ సందర్భంగా కొత్వాల శ్రీనివాసరావు మాట్లాడుతూ, పాల్వంచ మండలంలో కాంగ్రెస్ పార్టీకి లభించిన అపూర్వ ఆదరణ ప్రజల నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు చేసిన కృషి ఫలితంగానే ఈ విజయాలు సాధ్యమయ్యాయని ఆయన విశ్లేషించారు. ప్రజాస్వామ్యబద్ధంగా, అభివృద్ధి దిశగా కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పోరాటానికి ప్రజలు అండగా నిలిచారని తెలిపారు. ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి ఈ సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థుల ఘన విజయంపై నాయకులను అభినందించారు. పాల్వంచ మండల ప్రజలు కాంగ్రెస్‌పై ఉంచిన విశ్వాసం పార్టీకి మరింత బాధ్యతను పెంచిందని అన్నారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కేంద్రం, రాష్ట్ర స్థాయిల్లో అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్వాల శ్రీనివాసరావుతో పాటు మాజీ జెడ్పీ చైర్మన్ బరపటి వాసుదేవరావు, మాజీ జడ్పిటిసి ఎర్రంశెట్టి ముత్తయ్య, పాల్వంచ మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొండం వెంకన్న గౌడ్, పెద్దమ్మగుడి చైర్మన్ బాలునేని నాగేశ్వరరావు, పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పైడిపల్లి మహేష్, కాంగ్రెస్ నాయకులు వై వెంకటేశ్వరరావు, డిష్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొని ఈ విజయోత్సాహాన్ని పంచుకున్నారు.

# నూతన వార్డు సభ్యులకు సన్మానం



**చట్టం నవీపేట్ :** నవీపేట్ మేజర్ గ్రామపంచాయతీ ఎన్నికల్లో నూతనంగా గెలుపొందిన బిజెపి వార్డు సభ్యులను నాంపల్లి స్టేట్ ఆఫీసులో రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు సోమవారం ఘనంగా సన్మానించారు. 3వవార్డ మంజుల ప్రవీణ్, 4వ వార్డుబునాది నవీన్, 12వ వార్డు బండారి రాజశేఖర్, 16వ వార్డు మెగావాత్ ప్రేమ్ సింగ్ లుగెలుపొందంగా వీరిని రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

# వివిధ గ్రామాలలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న పోచారం భాస్కర్ రెడ్డి

- కాంగ్రెస్ పార్టీ అధిష్టానం బలపరిచిన అభ్యర్థులను గెలిపించండి



**చట్టం నసురుల్లాబాద్:** స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా కామారెడ్డి జిల్లా నసరుల్లాబాద్ మండలం దుర్కీ, అంకోల్ గ్రామాలలో సోమవారం రోజు ఉమ్మడి జిల్లా మాజీ డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరిస్తూ, కాంగ్రెస్ పార్టీ బలపరిచిన దుర్కీ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా ఏడే పద్మ మోహన్ కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని గ్రామ ప్రజలకు ఆయన వివరించారు. అనంతరం అంకోల్ గ్రామంలో పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి సుంచు జమున మోహన్ కు ఓటు వేసి సుంచు జమున మోహన్ ని గెలిపించాలని ఎన్నికల ప్రచారంలో ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పెరిక శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సాయిలు, మాజీ రైతు సమన్వాయ మండల అధ్యక్షులు సాయిలు యాదవ్, వివిధ గ్రామాల సర్పంచులు ఎంపిటిసిలు పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు ఈ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు

# నూతన సర్పంచ్ మల్చలం లక్ష్మీ లింగయ్యకు ఘనంగా సన్మానం

- ఘనంగా సన్మానించిన కాంగ్రెస్ నేతలు




**చట్టం, శంషాబాద్ :** ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికలలో చౌదర్ గూడ గ్రామానికి చెందిన సర్పంచ్ మల్చలం లక్ష్మీ లింగమయ్య విజయం సాధించడంతో సోమవారం నర్కూడ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ చందనవెల్లి శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ శివాజీ, శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ డైరెక్టర్ నీరటి కృష్ణ, పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ పర్వతం బల్వంత్, గుండాల విష్ణు విశ్వనాథం, నీరటి జంగయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొని సర్పంచ్ మల్చలం లక్ష్మీ లింగమయ్యను ఘనంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామ అభివృద్ధికి అన్ని విధాలుగా నిలవాలని ప్రభుత్వ సహాయ సహకారాలు చూపాలని గ్రామ అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారంలో నిబంధనతో పనిచేయాలని సూచించారు. ప్రజల ఆశయాల అనుగుణంగా పాలన సాగించాలని కోరారు. సర్పంచిగా విజయం సాధించినందుకు ఆయనకు అభినందనలు తెలిపారు.

# సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ ను సన్మానించిన సిపిఐ నేతలు

- భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు ప్రభు మండల కార్యదర్శి నరగిరి

**చట్టం, శంషాబాద్ :** శంషాబాద్ మండల పరిధిలోని నర్కూడ గ్రామ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ నూతనంగా ఎన్నికైన సందర్భంగా సోమవారం శంషాబాద్ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు ప్రభు ముదిరాజ్, మండల అధ్యక్షుడు నర్రగిరి శాలువాతో సత్కరించి పూలమాల వేసి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామపంచాయతీని మండలంలోని నెంబర్ వన్ గ్రామంగా తీర్చిదిద్దాలని కోరారు. మంచి పాలనతో ముందుకు సాగాలని తెలిపారు. గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని వారు పేర్కొన్నారు.



# ఎంఎస్ అగర్వాల్ స్టీల్ కంపెనీలో కార్మికుడి సజీవ దహనం

- ఇద్దరికి తీవ్ర గాయాలు
- కార్మికుడు స్పాట్ లోనే చనిపోతే
- గాయలయ్యాయని చికిత్స నడుస్తుందంటూ డ్రామా
- బిక్కుబిక్కుమంటున్న తోటి కార్మికులు
- యాజమాన్య నిర్లక్ష్యంపై కార్మికుల ఆగ్రహం

**చట్టం, తూప్రాన్;**

మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం రంగాయిపల్లి గ్రామ సమీపంలోని ఎంఎస్ అగర్వాల్ స్టీల్ పరిశ్రమలో జరిగిన ఘోర ప్రమాదం యావత్ జిల్లాను ఉలిక్కిపడేలా చేసింది. పరిశ్రమలోని బట్టీలు ఒక్కసారిగా పేలిపోవడంతో ఆ ప్రాంతమంతా భయానక దృశ్యాలకు నిలయంగా మారింది. భద్రతా ప్రమాణాలను పూర్తిగా విస్మరించిన యాజమాన్య నిర్లక్ష్యమే ఈ విషాదానికి కారణమని కార్మికులు ఆరోపిస్తున్నారు. పేలుడు సమయంలో బిహార్ రాష్ట్రానికి చెందిన అనుసర్ విశ్వకర్మ (37) అనే కార్మికుడు బట్టీలో పడిపోవడంతో సజీవదహనమయ్యాడు. అతడి అరుపులు ఎవరికీ వినిపించక ముందే ప్రాణాలు విడిచిన ఘటన అక్కడున్న సహచరులను కన్నీళ్లు పెట్టించింది. భద్రతా చర్యల లేమే ప్రమాదానికి మూలం పరిశ్రమలో కనీస భద్రతా పరికరాలు లేవని, రక్షణ దుస్తులు, హెచ్చరిక వ్యవస్థలు లేకుండానే కార్మికులను



పనిచేయిస్తున్నారని కార్మికులు వాపోతున్నారు. తరచూ బట్టీల వద్ద సాంకేతిక లోపాలు తలెత్తుతున్నా యాజమాన్యం పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. "ముందే చెప్పాం... ఎవరూ వినలేదు... ఇప్పుడు ఒక ప్రాణం పోయింది" అంటూ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలువురి పరిస్థితి విషమం ఈ ప్రమాదంలో బిహార్‌కు చెందిన రాజేష్ పండే, జితేంద్ర రాయి, అలాగే అన్వేష్, రీతూ అనే కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించగా, కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. అయితే గాయపడిన కార్మికుల పూర్తి వివరాలను యాజమాన్యం గోప్యంగా ఉంచుతున్నట్లు ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి. కన్నీటి పర్యంతమైన మృతుడి కుటుంబం అనుసర్ విశ్వకర్మ మృతితో అతడి సహచర కార్మికులు తల్లడిల్లిపోయరూ. జీవనాధారం కోల్పోయిన కార్మిక కుటుంబానికి "మాకు న్యాయం కావాలి... కార్మికుని ప్రాణం నిర్లక్ష్యంతో పోయింది" అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. మృత దేహాన్ని చూసి కుటుంబ సభ్యులు కుప్పకూలిపోవడం అక్కడ హృదయవిదారక దృశ్యంగా మారింది. కార్మికుల ఆందోళన ఉద్రిక్తత ఈ ప్రమాదానికి నిరసనగా పరిశ్రమ ఎదుట కార్మికులు భారీగా ఆందోళనకు దిగారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. సమాచారం అందుకున్న వెంటనే తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఘటనపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు తెలిపారు. అలాగే తూప్రాన్ సీఐ రంగ కృష్ణ ఆధ్వర్యంలో మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్ గౌడ్, తూప్రాన్ ఎస్ఐ శివానందం, శివ్వంపేట, వెల్దుర్తి ఎస్ఐలు పోలీస్ సిబ్బందితో కలిసి రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. కార్మికులు న్యాయం కోసం డిమాండ్ చేస్తున్నారు. యాజమాన్య నిర్లక్ష్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని, మృతుడి కుటుంబానికి తక్షణమే భారీ పరిహారం అందించాలని, పరిశ్రమ భద్రతా ప్రమాణాలపై స్వతంత్ర విచారణ చేపట్టాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# మూడవ దశ గ్రామపంచాయతీ ఎన్నికలకు పటిష్టమైన భద్రతా : జిల్లా ఎస్పీ డి వి శ్రీనివాసరావు



**చట్టం మెదక్ ప్రతినిధి :** మెదక్ జిల్లా పరిధిలో డిసెంబర్ 17, 2025 బుధవారం జరగనున్న మూడవ దశ గ్రామ పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. ఈ ఎన్నికలు జరుగుతున్న మండలలో BNSS సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలను విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ నిషేధాజ్ఞలు మెదక్ జిల్లా పరిధిలోని కూల్చారం, కౌడిపల్లి, నర్సాపూర్, చిలిపిచేడ్, శివంపేట్, ఎల్దుర్తి, మసాయిపేట్ అనే మొత్తం 7 మండలాల పరిధిలో అమలులో ఉంటాయని స్పష్టం చేశారు. ఈ మండలాల పరిధిలో గుమికూడటం, సమావేశాలు, ప్రదర్శనలు, ర్యాలీలు నిర్వహించడం పూర్తిగా నిషేధించబడిందని పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులు 15122025 సోమవారం సాయంత్రం 5:00 గంటల (17:00 hrs) నుండి ఎన్నికలు పూర్తయ్యే వరకు అమలులో ఉంటాయని జిల్లా ఎస్పీ తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు పోలీసు బందోబస్తు పటిష్టంగా కొనసాగుతుందని, పోలింగ్ కేంద్రాల వద్ద తగిన భద్రతా ఏర్పాట్లు చేశామని వివరించారు. ఈ నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. ఎన్నికల సమయంలో ఎవరైనా చట్టాన్ని అతిక్రమించినా, శాంతిభద్రతలకు భంగం కలిగించినా, వెంటనే చర్యలు తీసుకోబడుతుందని హెచ్చరించారు. ఎన్నికలు శాంతియుతంగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు జిల్లా ప్రజలు పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించాలని, ప్రజలు ఎలాంటి భయభ్రాంతులకు గురికాకుండా నిర్భయంగా పోలింగ్ కేంద్రాలకు వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు తెలిపారు.

# అభివృద్ధి కావాలా దౌర్జన్యం కావాలా మీరే నిర్ణయించండి



- నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి

**చట్టం న్యూస్ శివ్వంపేట :** శివంపేట గ్రామంలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి వారాల గణేష్ ను అత్యధిక మెజార్టీతో ఓట్లు వేసి గెలిపించవలసిందిగా కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఆవుల రాజిరెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. సోమవారం ఆయన మండల కేంద్రమైన శివంపేటలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థికీ మద్దతు గా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సందర్భంగా జరిగిన సభ లో ఆయన మాట్లాడుతూ గత 5 సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో మంది భూములను గుంజుకోవడమే వారికి ఎజెండాగా మారిందన్నారు. లక్షలాది రూపాయలు అప్పు చేసి కెసిఆర్ పామోదులో బొక్క బోర్ల పండుకున్నాడని చెప్పారు. ప్రజాపాలన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోజుకు 18 గంటలు శ్రామిస్తూ, రైతు భరోసా, రైతుబీమా, ప్రతి ఇంటికి 200 యూనిట్ల కరెంటు ఉచిత సరఫరా, రేషన్ కార్డులు, పేదలకు సన్న బియ్యం, మహిళలకు ఉచిత బస్సు రవాణా సదుపాయం, రూ. 500 కే గ్యాస్ సిలిండర్, రాజీవ్ ఆరోగ్యశ్రీనీ పేదలకు ఉచిత వైద్యం అందించడానికి దానిని 5 లక్షల నుంచి 10 లక్షల కు పెంచడం జరిగిందని ఆవుల రాజిరెడ్డి గుర్తు చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు పులిమామిడి నవీన్ గుప్తా, స్థానిక సర్పంచ్ అభ్యర్థి వారాల గణేష్, నాయకులు బాసంపల్లి శ్రీనివాస్ గౌడ్, సయ్యద్ దావూద్, బిస్కుంద్ అంజయ్య లు మాట్లాడుతూ తాజా మాజీ శివ్వంపేట గ్రామపంచాయతీ పాలకవర్గం వారి పదవి కాలంలో అనేక అక్రమాలకు పాల్పడిందని, స్థానికంగా ఉన్న ఒక రైస్మిల్ యజమానులు, తూప్రాన్ నర్సాపూర్ రోడ్డు అనుకొని షట్టర్లు నిర్మించినందుకును గ్రామ పంచాయతీ అనుమతుల పేరుతో, అక్కడ భూ వివాదం రగిలించి, ఆ యజమాలను భయభ్రాంతులకు గురిచేసి వారి నుంచి 40 లక్షల రూపాయలు వసూలు చేశారని ఆరోపించారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ తరపున షట్టర్లు నిర్మిస్తే, ఒక్కొక్క షటర్ దారుడీ నుంచి 40 వేల రూపాయలు చొప్పున వసూలు చేశారని గుర్తు చేశారు, గ్రామంలోని యువకులకు 5 వేలు, 3 వేలు ఇస్తూ, వారిని తాగుబోతులుగా మత్తు పదార్థాలు అలవాటు చేశారనీ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో కొంత మందికీ యువకులకు ఇప్పటికి 30 సంవత్సరాలు దాటిన వివాహాలు కూడా జరగడంలేదని వాపోయారు. అంతేకాదు వారి దౌర్జన్యాలు పరాకాష్టకు చేరినటువంటి వివక్షత, మోసపూరిత విధానాలు పంచరంగుల ప్రచారాలు, దంబికాలు, మహిళలకు డబ్బు ఇచ్చి దావతు చేసుకోమని చెప్పి ఇతర ప్రదేశాల పంపిస్తుండగా మార్గమధ్యంలో రోడ్డు ప్రమాదం జరిగి, గ్రామానికి చెందిన ఒక మహిళ మరణించడం జరిగిందని కాంగ్రెస్ నాయకులు గుర్తు చేశారు. గ్రామంలోనీ ప్రభుత్వ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం అంతర్భాగంగా ఉన్న ప్రభుత్వ హోమియో పాతి దవాఖానను కూల్చివేయడం ద్వారా ఆ దవాఖాన ఇతర ప్రదేశానికి తరలిపోయిందని నవీన్ గుప్తా చెప్పారు. స్థానికంగా ఉన్న బురుజుకు, రోడ్డుపై ఉన్న డివైడర్లకు రంగులు వేస్తామని స్థానికంగా ఉన్న ప్రైవేటు వైద్యుల నుంచి, అలాగే మాంసం దుకాణదారుల నుంచి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేశారన్నారు. 2012 నుంచి 18 వరకు ప్రభుత్వ పనులు చేసే కాంట్రాక్టర్లను బెదిరించి, వారి నుంచి అయితే 30 శాతం కమిషన్ లేదంటే దరఖాస్తు ఇలా వ్యవహరించి గ్రామంలో భయభ్రాంతులకు గురిచేశరన్నారు, అదేవిధంగా అమాయకుల పెంట స్థలాలను, కందకా స్థలాలను కబ్జా చేసీ గ్రామంలో ఆటవిక రాజ్యం నడిపించారని బాధపడ్డారు. గ్రామపంచాయతీ రికార్డులను మాయం చేశారన్నారు. తమ కాంగ్రెస్ పార్టీ తరపున గ్రామంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని నవీన్ గుప్తా లక్షలాది రూపాయల సొంత నిధులతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆధునిక అంగులతో తీర్చిదిద్దడం జరిగిందని, అదేవిధంగా కోతులను గ్రామం నుంచి తరిమికొట్టడానికి వాహనం ఏర్పాటుచేసి కోతులను పట్టి ఇతర ప్రదేశాలలో వదిలేశామన్నారు. దానిపైన కూడా స్థానిక బీఆర్ఎస్ ఫిర్యాదు చేసి అది పనిచేయకుండా చేశారన్నారు. ఈ సమావేశం లో స్థానిక కాంగ్రెస్ నాయకులు కొడకంచి శ్రీనివాస్ గౌడ్, మంతూరి రమేష్, కాంలేగారి సత్యనారాయణ, బిజిలిపురం సత్తయ్య, వజ్జ శ్రీనివాస్, వజ్జ నగేష్, ఇసుగారి అరుణ్, ఈసారపు రాజు, శ్రీనివాస్ గౌడ్ నాతోపాటు నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దీనిపై చర్యలేవి కలెక్టర్ సారు

- హాస్టల్ విద్యార్థులకు 'కుక్కల కూడు'
- కౌసు వాసన వచ్చి నా చికెన్ కూర
- కడుగని బియ్యం బగారేసిన తీరు
- అన్నం పెట్టి టైం కు పర్యవేక్షణ కరువ
- అర్థాకలితో విద్యార్థులు ఏమనలేక, ఎవరికి చెప్పాలో దిక్కుతోచని పరిస్థితుల్లో పడుకోవడం



**చట్టం రామాయంపేట :** రామాయంపేట పట్టణంలో కూత వేటు దూరంలో పోలీసు స్టేషన్, తహసిల్దార్ ఆఫీస్ ఉన్నా కూడా వీరు షిఫ్ట్ గా పనిని పంచుకొని పర్యవేక్షణ చేస్తున్నారు అనగా ఎంత భయంతో ఉన్నారో చెప్పగానే తెరుస్తున్నది. బిసి, ఎస్సి, ఎస్టి హాస్టల్లో ఒకే బిల్డింగ్ లో కలిపి సమీకృత హాస్టల్ గా రూపాంతరం చెందింది. ముగ్గురు హాస్టల్ వార్డెన్లు నువ్వొస్తే మేం రాం, మేము వస్తే నీవు రాకు అంటూ వారు షిఫ్ట్ వారిగా జాబు చేస్తున్నారు కానీ వీరి యొక్క తరిక చూడడానికి మేము ప్రత్యక్షంగా వెళ్ళాము అక్కడ జరిగిన విశేషాలు చూసాము అదే అక్షరం పొల్లువకుండా రాస్తున్నాము కానీ చిత్తశుద్ధి లేకుండా పోయింది ఉన్నతాధికారులకు. చిత్తశుద్ధి ఉంటే ఇదివరకే చర్యలు తీసుకునేది ఉండే కానీ వారికి ముడుపులు మూడుతున్నాయని తెలుస్తుంది. జిల్లా అధికారులే ఇలా ఉంటే ఎలాగా కింది స్థాయి అధికారులు ఎలా ఉంటారు. విద్యార్థులకు దక్కి న్యాయము ఎలా దక్కుతుంది, వారి ఆకలి ఎలా సమసి పోతుంది అందుకు వారికి మెమో ఇచ్చి సస్పెండ్ చేయాలని ప్రజలు, తల్లిదండ్రులు, తదితరులు డిమాండ్ చేస్తున్నారు.

# వైద్యో నారాయణ "దామోదర "

- టైంకు రానీ సూపరింటెండెంట్ విలేకరులపై చిందులు, బెదిరింపులు



**చట్టం రామాయంపేట :** మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలో గల సామాజిక ఆరోగ్య కేంద్రం కు ప్రజలు వైద్యం నారాయణ హరి అంటూ ప్రాణాలను చేతిలో పెట్టుకొని డాక్టర్ దేవుళ్ళని మొక్కుతూ వస్తుంటారు. సూపరింటెండెంట్ రాకపోవడం పట్ల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అడుగుతే హనుమంత్ అన్నకు ఎమ్మెల్యేకు చెప్తానని భయభ్రాంతులకు గురి చేస్తూ బెదిరిస్తూ ఆయన ఆందోళనకు గురి చేస్తున్నారు. ప్రత్యక్షంగా పలువురు విలేకరులు పోతే మీ సంగతి హనుమంతన్నకు చెప్తా అంటూ బెదిరింపులకు గురిచేశాడు. అది కాస్త వీడియో రికార్డు ఐ ఉండడం వలన అదే ఎవిడెన్స్ అయ్యింది లేనిచో అగమ్యగోచరంగా మారేది కానీ అది ఎవిడెన్స్ ఉన్నది అక్కడ మరో విలేకరికి చూస్తుండగా వేరే విలేకరిని బెదిరించసాగాడు. లేనిచో ఆడిందే ఆట పాడిందే పాట విధులకు డుమ్మా కొట్టి పలువురి కింది స్థాయి అధికారుల మీద మాటలతో ఇది కాదంటే అది, అది కాదు అంటే ఇది అని మాటలతో దాడి చేసేవాడని కింది స్థాయి అధికారులు ఏ కరువు కరువు పెట్టారు. ఈ చర్యలు ఎంతవరకు సమంజసము ఆయన వచ్చేది 12 గంటలకు ఉదయం పోయేది 3 గంటలకు సాయంత్రం సిబ్బంది పై అజమాయిషి ఎలా చేస్తాడు ఎవరు ఎప్పుడు వచ్చారు అనేది ఏమీ తెలుస్తది. అందుకొరకు ఇక్కడ నుండి అనగా రామాయంపేట నుండి ఆయనను వేరే హాస్పిటల్ కు బదిలీ చేయాలని ప్రజలు, డాక్టర్లు, సిబ్బంది, కోరుకుంటున్నారు.

# అయ్యప్ప పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్



**చట్టం కథలాపూర్ :** కథలాపూర్ మండలం పెగ్గర్ల గ్రామంలో అయ్యప్ప పడిపూజ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలను చిరునవ్వుతో ఆప్యాయంగా పలకరిస్తూ ఆ అయ్యప్ప యొక్క కరుణ కటాక్షాలు అందరికీ మెండుగా కలగాలని తెలిపారు. అలాగే నూతనంగా గ్రామ సర్పంచిగా ఎన్నికైనటువంటి కుంటాల లక్ష్మి నరేష్ శుభాకాంక్షలు తెలుపుతూ గ్రామ అభివృద్ధి పై ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్నినెరవేరుస్తూ ఎల్లవేళలా ప్రజల కొరకై పాటుపడుతూ గ్రామ అభివృద్ధిలో చురుగ్గా పాల్గొనాలని అందుకు కావలసిన సహకారాలు అందించడంలో తాను వెన్నుదన్నుగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కథలాపూర్ మండల్ కాంగ్రెస్ నాయకుడు కాయితి నాగరాజ్, రాష్ట్ర చేనేత కార్యవర్గ సభ్యుడు పులి హరిప్రసాద్, మండల కార్యవర్గ సభ్యుడు జవాజి రవి, బొమ్మెన గ్రామ శాఖ అధ్యక్షుడు సత్యనారాయణ, స్థానిక కాంగ్రెస్ నాయకులు కారపు గంగాధర్, లవన్ కుమార్, అంజా గౌడ్, తదితర నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎక్సలెన్స్ అవార్డు రావడం సంతోషకరం

- పాఠశాల చైర్మన్ సంజీవ్ కుమార్




**చట్టం పెద్దపల్లి :** స్కూల్స్ ఎక్సలెన్స్ అవార్డు లభించడం ఎంతో సంతోషకరమైన విషయమని ఇండియన్ పబ్లిక్ పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్ అన్నారు. శనివారం హైదరాబాద్ లో ట్రస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఎట్ టెక్ స్కూల్ ఎక్సలెన్స్ అవార్డు' కార్యక్రమంలో సుల్తానాబాద్‌లోని ఇండియన్ పబ్లిక్ పాఠశాలకు ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు దక్కింది. సోమవారం పాఠశాల వేదికగా ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్ ప్రిన్సిపాల్ కృష్ణప్రియలకు పుష్పగుచ్చం అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్ మాట్లాడుతూ... విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు అందించాలనే లక్ష్యంతో పాఠశాల ముందుకు సాగుతోందని తెలిపారు. ఉపాధ్యాయుల అంకితభావం, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ నాయకత్వం, విద్యార్థుల కృషి ఫలితంగానే ఈ అవార్డు లభించిందన్నారు. భవిష్యత్తులో మరింత మెరుగైన విద్యా ప్రమాణాలు నెలకొల్పి, జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించే దిశగా కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ అవార్డు పాఠశాల సిబ్బందికి, విద్యార్థులకు మరింత ఉత్సాహాన్ని అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక
CHATTAM NEWS
నిజామాబాద్
మంగళవారం
16.12.2025


# ఈ రోడ్డు నిర్మించి మూడు నెలలు కాలేదు మళ్ళీ డ్రిల్లర్‌తో తవ్వారు


- కార్పొరేషన్ హై లెవెల్ ఇంజనీర్ దగ్గరుండి రాత్రి వరకు వేపించిన రోడ్డు కూడా
- మళ్లీ రిపేర్లకు వస్తే ఎలా
- రోడ్డు వేసే ముందు జాగ్రత్త ప్రణాళిక అవసరం
- అర్ధరాత్రి స్మూత్ గా రోడ్డు వేస్తే నాలుగు ప్రమాదాలు మూడు నెలల్లోనే
- ఇది నిర్లక్ష్యమా!! ప్రణాళిక రాహిత్యమా!!
- కాంట్రాక్టర్ల జేబులు నింపడమా
- సూటిగా ప్రశ్నిస్తున్న వాహనదారులు, పాదాచార్యులు, ప్రజలు



**చట్టం రామగుండం :** రామగుండం కార్పొరేషన్ పరిధిలోని మెయిన్ రోడ్డు నుండి అశోక్ నగర్ ద్వారా లక్ష్మీ నగర్ వెళ్లే సిమెంట్ రోడ్డు నిర్మాణం చేసి మూడు మాసాలు కావస్తుంది. ఒకవైపు మూడు మాసాలు, మరోవైపు నెలరోజులు కావస్తుంది.ఈ రోడ్డు వేయడం కోసం కార్పొరేషన్ ఇంజనీరింగ్ బృందం ఎన్నో ప్రణాళికలు వేసి ఎంతో శ్రద్ధతో ప్రజల మెప్పు పొందేలా సీనియర్ ఇంజనీర్లు దగ్గర ఉండి రాత్రి వరకు రోడ్డు నిర్మాణం చేపించారు ప్రజల మన్ననలు పొందారు. కానీ ఈ రోడ్డు బాగా స్మూత్ గా వేయడంతో మూడు నెలల్లో నాలుగు బైక్ ప్రమాదాలు జరిగాయి కారణం స్మూత్ గా వేయడం పైన నీరు నిలిచి ఉండడం సన్నటి మట్టి చేరుకోవడంతో చిన్నగా బ్రేక్ వేస్తే ఈ సంఘటనలు జరిగాయి ఇదేమిటి అని ప్రశ్నిస్తే ఆ తప్పు వాహనదారులదని ఈజీగా తప్పించుకున్నారు.ఇంజనీరింగ్ అధికారులు మూడు మాసాలు గడుస్తూ వచ్చాయి ప్రధాన రహదారి నుండి లక్ష్మీ నగర్ కు వెళ్లే ఈ అప్రోచ్ రోడ్డు లారీల పార్క్ వద్ద మళ్లీ రెండు రోజుల నుండి డ్రిల్లర్ తో వేల రూపాయల ఖర్చుతో కొత్తగా వేసిన రోడ్డును భయంకరంగా పెద్ద బావి లాగా తవ్వి చుట్టు మట్టి పోశారు. భూగర్భంలో నిలిచి ఉన్న పైపులైన్ లేదా నీటి ఊట ఈ ఇంజనీర్లు గమనించలేదా అంటూ ప్రశ్నిస్తున్నారు. ప్రజలు రోడ్డు వేశాము మమ అనిపించుకొని జేబులు నింపుకోవాలనుకున్న సదరు కాంట్రాక్టర్లకు ఈ ఇంజనీర్లు ఎలాంటి తనిఖీలు చేయలేదా ఇంత నిర్లక్ష్యం ఎందుకు అంటూ గుమ్మిగూడిన ప్రజలు కార్పొరేషన్ అధికారులను ప్రశ్నిస్తున్నారు.ఎప్పుడు కూడా ఎక్కడైనా కూడా పర్మినెంట్గా వేసిన సిమెంట్ రోడ్డులు తమ అవసరాల కోసం ప్రజలు ఎవరైనా కొత్త రోడ్లను తవ్వేస్తే 2400చలాన్ కార్పొరేషన్ ఆఫీసులో చెల్లించి పర్మిషన్ తీసుకోవాలని కార్పొరేషన్ అధికారులు గతంలో పత్రికా ప్రకటన చేయడం జరిగింది.మరి ఇప్పుడు మూడు మాసాల కింద వేసేటప్పుడు దాని భూగర్భ పరిశీలన చేసి పక్క పర్మినెంట్ సోర్స్ ప్రకారంగా ఈ రోడ్డు వేస్తే తిరిగి మళ్ళీ లక్ష రూపాయలు ఖర్చుపెట్టి నిర్మాణం చేయాల్సిన అవసరం ఉండేది కాదు కదా అంటూ, ఈ తవ్వకాలకు ఇక్కడ పర్మిషన్ తీసుకోలేదు వీరికి ఆ పత్రిక ప్రకటన వర్తించదా అని మేధావులు ప్రశ్నిస్తున్నారు. ఈ నిర్లక్ష్యం ఇంజనీరింగ్ అధికారులుదా, కాంట్రాక్టర్లదా దీనికి సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని పలు సంఘాల నాయకులు సామాజిక వేత్తలు ప్రశ్నిస్తున్నారు. ఎందుకింత నిర్లక్ష్యం ప్రజల సొమ్మంటే ఇంత అపహాస్యమా అని విమర్శిస్తున్నారు.

## జిల్లాలో మూడవ దశ ఎన్నికలకు కట్టుదిట్టమైన బందోబస్త్ ఏర్పాట్లు

- జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS



**చట్టం వికారాబాద్ ప్రతినిధి :** జిల్లాలో మూడవ దశ పంచాయతీ సంస్థల ఎన్నికలను శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా తెలిపారు. పరిగి, కుల్కచర్ల, దోమ, చెన్గోముల్ మరియు చౌడాపూర్ మండలాల్లో డిసెంబర్ 17, 2025న జరగనున్న ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా అప్రమత్తత చర్యలు అమలులో ఉన్నాయని వెల్లడించారు. మొత్తం 145 పోలింగ్ లొకేషన్లలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్న ఎస్పీ, భద్రతా విధుల కోసం సుమారు 800 మంది పోలీస్ సిబ్బందిని నియోగించినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద నిరంతర నిఘా ఏర్పాటు చేయడంతో పాటు, సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్త్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నేటి సాయంత్రం 5 గంటల నుండి 'సైలెంట్ పీరియడ్' అమలులోకి వచ్చినట్లు పేర్కొన్న ఎస్పీ, పోలింగ్ పూర్తయ్యే వరకు ఎన్నికల సభలు, సమావేశాలు, ఇంటింటా ప్రచారం, లౌడ్‌స్పీకర్లు, ర్యాలీలు మరియు బైక్ ర్యాలీలకు నిషేధం అమలులో ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్నా, లేదా సామాజిక మాధ్యమాల్లో తప్పుడు, విద్వేషపూరిత ప్రచారాలు నిర్వహించినా సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ, ఎన్నికలు ప్రశాంతంగా సజావుగా జరిగేందుకు జిల్లా ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.

## సీనియర్ నాయకులు ఉడుతల ఉమా నారా గౌడ్ ని గెలిపించండి : ఏనుగు రవీందర్ రెడ్డి

- దుర్కీ గ్రామ సర్పంచిగా ఉడుతల ఉమా నారా గౌడ్‌ని గెలిపించండీ



**చట్టం నసురుల్లాబాద్ :** కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్ మండలం, దుర్కీ, గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఉడుతల ఉమా నారా గౌడ్ కు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామని అభివృద్ధి చేయాలని సంకల్పంతో రాజకీయ అనుభవంతో ఉన్న వ్యక్తి ఉడుదల ఉమా నారా గౌడ్ అని తెలిపారు. గ్రామ సర్పంచిగా గెలిపించాలని ఎన్నికల ప్రచారంలో ఆయన తెలిపారు. ఈ ప్రచారంలో పాల్గొన్న, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయకుమార్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి కిషోర్ యాదవ్, సొసైటీ చైర్మన్ డివిటి శ్రీనివాస్ యాదవ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు మహిళలు యువకులు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

## 47వ డివిజన్‌లో బీజేపీ బూత్ కమిటీల ఏర్పాటు పూర్తి



**చట్టం ఇందూరు:** నగరంలోని ఎల్లమ్మ గుట్ట 47వ డివిజన్ పరిధిలో భారతీయ జనతాపార్టీని బలోపేతం చేసే దిశగా బూత్ కమిటీల ఏర్పాటు ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. శక్తి కేంద్ర ఇంచార్జి గిరిబాబు ఆధ్వర్యంలో డివిజన్ ఇంచార్జి బొబ్బిలి వేణు గోపాల్ ఈ బూత్ కమిటీలను నియమించారు. ఈ సందర్భంగా వివిధ బూత్‌లకు అధ్యక్షులుగా 46వ బూత్ ప్రెసిడెంట్ వై. చరణ్, 153వ బూత్ ప్రెసిడెంట్ ఎ. వెంకటేష్, 165వ బూత్ ప్రెసిడెంట్ జి. గంగాదాస్, 167వ బూత్ ప్రెసిడెంట్ ఆర్. శివకృష్ణ, 168వ బూత్ ప్రెసిడెంట్ పి. ప్రవీణ్ కుమార్ లను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో పడాలా భూపతితో పాటు ఇతర బూత్ సభ్యులు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని బూత్ కమిటీల ఏర్పాటును స్వాగతించారు. ఈ కమిటీలు రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయం కోసం పటిష్టంగా పనిచేయడానికి పునాదిగా నిలుస్తాయని నాయకులు అభిప్రాయపడ్డారు.

## ఆర్టీఐ రాష్ట్రస్థాయి సెమినార్‌లో శిక్షణ పూర్తి చేసిన గాదం పోశయ్యకు ప్రశంసా పత్రం



**చట్టం భూపాలపల్లి ప్రతినిధి :** డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల సంస్థ (హెచ్ఆర్డీ), హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ)పై రాష్ట్రస్థాయి సెమినార్‌తో పాటు రెండు రోజుల వర్క్‌షాప్‌లో శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన జయశంకర్ భూపాలపల్లి యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టీఐ జిల్లా కమిటీ సభ్యుడు గాదం పోశయ్యకు ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో యునైటెడ్ ఫోరం ప్రతినిధులు శ్రీనివాస్ మాధవ్ గాదం పోశయ్యకు ప్రశంసా పత్రాన్ని అందించి అభినందించారు. సమాచార హక్కు చట్టంపై లోతైన అవగాహనను సంపాదించుకోవడంతో పాటు, ప్రజలకు ప్రభుత్వ సమాచారం సులభంగా అందేలా చేయడంలో ఆయన పాత్ర కీలకంగా ఉంటుందని వారు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి శిక్షణా కార్యక్రమంలో ఆర్టీఐ చట్టం అమలు విధానాలు, దరఖాస్తుల తయారీ, అప్పీల్ ప్రక్రియ, ప్రజాప్రయోజన అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా భూపాలపల్లి జిల్లాలో ప్రజల సమస్యలను ఆర్టీఐ ద్వారా మరింత సమర్థవంతంగా లేవనెత్తేందుకు గాదం పోశయ్య కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రశంసా పత్రం అందుకోవడం పట్ల గాదం పోశయ్య ఆనందం వ్యక్తం చేస్తూ, సమాచార హక్కు చట్టాన్ని ప్రజల ఆయుధంగా మార్చి పారదర్శక పాలనకు తోడ్పడతానని అన్నారు. యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టీఐ జిల్లా కమిటీ తరఫున ప్రజల హక్కుల కోసం నిరంతరం పనిచేస్తామని స్పష్టం చేశారు.

## మాక్లూర్,డొంకేశ్వర్ మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులుగా గోపు రంజిత్, నక్కల భూమేష్

- ఉత్తర్వులు జారీ చేసిన పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవన్ రెడ్డి
- పనిచేసే వారికే సముచిత స్థానమని స్పష్టీకరణ



**చట్టం ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలోని రెండు మండలాలకు బీఆర్ఎస్ పార్టీ కొత్త అధ్యక్షులను నియమించారు. మాక్లూర్ మండలానికి గోపు రంజిత్, డొంకేశ్వర్ మండలానికి నక్కల భూమేష్ లను బీఆర్ఎస్ అధ్యక్షులుగా నియమిస్తూ బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మాక్లూర్ మండల పార్టీ అధ్యక్షుడుగా నియమితుడైన గోపు రంజిత్, గుంజిలీ గ్రామానికి చెందిన వారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ అయిన రంజిత్, బీఆర్ఎస్ అధికారం కోల్పోయిన తరువాత కూడా పార్టీ బలోపేతానికి పాటుపడుతున్నారు. తాజాగా జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతుతో గుంజిలీ గ్రామ సర్పంచిగా పోటీ చేసిన తన సోదరుడు గోపు గోపీ, ని 546 ఓట్ల భారీ మెజారిటీతో గెలిపించుకోవడం ద్వారా రంజిత్, పార్టీ పెద్దల దృష్టినాకర్షించారు. అలాగే డొంకేశ్వర్ మండలం గాదెపల్లి గ్రామానికి చెందిన నక్కల భూమేష్, బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పనిచేస్తున్న క్రమశిక్షణ కలిగిన సీనియర్ నేతగా గుర్తింపు పొందారు. ఈ నేపథ్యంలో వారిద్దరినీ మండల శాఖల బీఆర్ఎస్ అధ్యక్ష పదవులు వరించాయి. ఇదిలావుండగా గుంజిలీ గ్రామ సర్పంచిగా బీఆర్ఎస్ అభ్యర్థి గోపీని భారీ మెజారిటీతో గెలిపించడంలో కీలక పాత్ర పోషించిన రంజిత్ ను జీవన్ రెడ్డి, అభినందించారు. కష్ట కాలంలో పార్టీ కోసం పనిచేసే వారికి సముచిత గౌరవం లభిస్తుందన్నారు. మాక్లూర్, డొంకేశ్వర్ మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులుగా నియమితులైన వారికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

## సోమార్ పేట్ లో ఉద్రిక్తత.. ఓడిన అభ్యర్థి ఇంటి పై దాడి సర్పంచ్ తమ్ముడు

- మా పైనే సర్పంచ్ గా పోటీ చేస్తావా
- ట్రాక్టర్‌తో ఓడిన అభ్యర్థి ఇంటి పై దాడి





**చట్టం ప్రతినిధి కామారెడ్డి ;** ఎల్లారెడ్డి మండలంలోని సోమార్ పేట్ లో ఉద్రిక్తత చోటు చేసుకుంది. సర్పంచ్ ఎన్నికలు ముగిసిన మరుసటి రోజే గ్రామంలో దాడి ఘటన కలకలం రేపింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల సర్పంచ్ ఎన్నికలు జరగగా బిఆర్ఎస్ పార్టీ మద్దతుదారుడు ఓడిపోయాడు.అయితే తాము గెలిచినప్పటికీ ఇబ్బందులు పెట్టాడనే కక్షతో ప్రత్యర్థి వర్గం గ్రామంలోని ఓడిన అభ్యర్థి బిట్ల బాలరాజు ఇంటిపై దాడికి దిగిందని గ్రామస్థులు పేర్కొన్నారు. ట్రాక్టర్ తో ఆయన ఇంటిపైకి దాడికి వెళ్లగా బాలరాజు తప్పించుకున్నాడని వారు తెలిపారు.

**నలుగురికి గాయాలు**

ఈ క్రమంలో గంజి భారతి, తోట శారద, బాలమణి, సత్యవ్వకు గాయాలయ్యాయి. వీరిలో గంజి భారతి, తోట శారద పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ కు తరలించారు. బాలమణి, సత్యవ్వలను ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. రాజకీయ కక్షలతోనే ఓడిపోయిన అభ్యర్థి ఇంటిపై దాడికి పాల్పడ్డారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

**నిజాంసాగర్ రోడ్డుపై రాస్తారాకో**

ఈ క్రమంలో బాధిత వర్గానికి మద్దతు తెలుపుతూ పలువురు బీఆర్ఎస్ నాయకులు నిజాంసాగర్ రోడ్డుపై రాస్తారోకో చేశారు. దాడికి పాల్పడిన వ్యక్తిని.. ఆయనను ప్రోత్సహించిన వ్యక్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ రాజారెడ్డి, ఎస్సై మహేశ్, సుబ్రహ్మణ్యం సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడి సముదాయించే ప్రయత్నం చేశారు. అయితే తమకు న్యాయం జరిగే వరకు రాస్తారోకో విరమించేది లేదని వారు భీష్మించుకు కూర్చున్నారు. ఈ సందర్భంగా ' కామారెడ్డి చట్టం ప్రతినిధి డీఎస్పీ శ్రీనివాస్ రావుతో మాట్లాడగా గ్రామంలో విచారణ చేస్తున్నామని పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని పేర్కొన్నారు.


## 17వ తేదీన పోలింగ్ ముగిసే వరకు నిశ్శబ్ద కాలం అమలు : జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**చట్టం వికారాబాద్ ప్రతినిధి :** గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 17వ తేదీన నిర్వహించనున్న పోలింగ్ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ ముగింపు సమయం మధ్యాహ్నం 1:00 గంటల వరకు నిశ్శబ్ద కాలం (సైలెన్స్ పీరియడ్) అమల్లో ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో మూడవ విడత ఎన్నికలు జరగనున్న పరిగి, కుల్కచెర్ల, పూడూర్, చౌడాపూర్, దోమ మండలాల పరిధిలో ఈ నిశ్శబ్ద కాలం కచ్చితంగా అమలు చేయనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. పోలింగ్ జరుగనున్న ప్రాంతాలలో పోలింగ్ ముగింపు సమయానికి 44 గంటల ముందు నుంచే నిశ్శబ్ద కాలం అమల్లో ఉంటుందని, ఈ క్రమంలో ఈ నెల 15వ తేదీ సాయంత్రం 5:00 గంటల నుంచి 17.12.2025 మధ్యాహ్నం 1:00 గంటల వరకు, అలాగే కౌంటింగ్ ముగిసే వరకు సంబంధిత పోలింగ్ ప్రాంతాల్లో సెక్షన్ 144 అమల్లో ఉంటుందని తెలిపారు. ఈ సమయంలో ఎలాంటి బహిరంగ సమావేశాలు, సభలు, ఊరేగింపులు నిర్వహించడానికి అనుమతి ఉండదని స్పష్టం చేశారు. అలాగే సినిమా, టెలివిజన్, సోషల్ మీడియా లేదా ఇతర మాధ్యమాల ద్వారా, సంగీత, నాటక, వినోద కార్యక్రమాల రూపంలో ఎన్నికల ప్రచారం చేయడం పూర్తిగా నిషేధమని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు ప్రజలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు అందరూ ఎన్నికల సంఘం ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని ఆయన కోరారు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం, 2018లోని సెక్షన్ 214(2) ప్రకారం కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతీక్ జైన్ హెచ్చరించారు.

## ఉప సర్పంచ్ ముబీన్ ను సన్మానించిన బీఆర్ఎస్ సోషల్ మీడియా నాయకులు మజర్

**దంతన్ పల్లి గ్రామ చరిత్రలోనే మొదటి మైనార్టీ ఉప సర్పంచ్ ముబీన్**



**చట్టం, బోథ్ :** మొదటి విడతలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో ఉట్నూర్ మండలంలోని దంతన్ పల్లి గ్రామ ఉప సర్పంచ్ గా ఎన్నికైన మొహమ్మద్ ముబీన్ ను సోమవారం బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా జిల్లా నాయకులు మజర్ శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మజర్ మాట్లాడుతూ.. దంతన్ పల్లి గ్రామ చరిత్రలోనే మొట్ట మొదటిసారిగా మైనార్టీ ఉప సర్పంచ్ కావడం గొప్ప విషయమని, ఇది మైనార్టీలు గర్వపడే విషయమని అన్నారు. 400 ఓట్లు గల దంతన్ పల్లి గ్రామంలో ఎన్నో ఏండ్ల నుంచి మైనార్టీలకు అవకాశం రాలేదని, గొప్ప అవకాశాన్ని కల్పించుకుని ముబీన్ చరిత్ర సృష్టించారని అభినందించారు.

## పెద్దపల్లి–మంచిర్యాల అభివృద్ధికి రూ.4,000 కోట్ల ప్రాజెక్టులు

- సెమీకండక్టర్ ఫెసిలిటీపై కేంద్రానికి వినతి



**చట్టం న్యూఢిల్లీ :** పెద్దపల్లి-మంచిర్యాల జిల్లాలకు సంబంధించిన రూ.4,000 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టుల పురోగతిపై పెద్దపల్లి ఎంపీ పార్లమెంట్‌లో కేంద్ర రైల్వే, ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ ని ప్రశ్నించారు. ప్రాజెక్టుల స్థితిగతులపై పూర్తి వివరాలతో సమాధానం ఇస్తామని మంత్రి హామీ ఇచ్చారు.అదే సమయంలో, తెలంగాణకు తీసుకురావాల్సిన సెమీకండక్టర్ ఫెసిలిటీ రాజకీయ కారణాలతో ఆంధ్రప్రదేశ్‌కు తరలించడంపై పెద్దపల్లి ఎంపీ తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఈ ప్రాజెక్టు తెలంగాణకు వచ్చి ఉంటే వేలాది యువతకు ఉద్యోగ అవకాశాలు కలిగేవని పేర్కొన్నారు. స్పష్టమైన ప్రపోజల్ ఇవ్వాలని కేంద్రం సూచించగా, దానిపై అన్ని అవకాశాలు పరిశీలిస్తామని మంత్రి తెలిపారు.ఈ నేపథ్యంలో మంత్రి అశ్విని వైష్ణవ్ ని పెద్దపల్లి ఎంపీ వ్యక్తిగతంగా కలిసి, పెద్దపల్లి-మంచిర్యాల ప్రాంతంలో ఉన్న నీటి వనరులు, భూమి లభ్యత, నైపుణ్యం కలిగిన యువత ప్రతిభను వివరించారు. రామగుండం ఫర్టిలైజర్ కార్పొరేషన్, సింగరేణి సంస్థల విజయాన్ని ఉదాహరణగా చూపుతూ, ఈ ప్రాంతం పరిశ్రమలకు అత్యంత అనుకూలమని తెలిపారు. సెమీకండక్టర్ ఫెసిలిటీ ఏర్పాటు అయితే రాష్ట్ర అభివృద్ధికి, యువత భవిష్యత్తుకు గణనీయమైన ప్రయోజనం ఉంటుందని పెద్దపల్లి ఎంపీ ఆశాభావం వ్యక్తం చేశారు.

## ముస్తాబాద్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన పోలీసు అధికారులు




**చట్టం ముస్తాబాద్ :** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌లోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్ర చారి, సిఐ మొగిలి, ముస్తాబాద్ ఎస్సై గణేష్ కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో భద్రతా ఏర్పాట్లు, సిబ్బంది విధులు, ఓటింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు తీసుకుంటున్న చర్యలను వారు పరిశీలించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని, ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పూర్తి భద్రత కల్పించాలని డీఎస్పీ నాగేంద్ర చారి సిబ్బందికి సూచించారు. పోలింగ్ కేంద్రం పరిసరాల్లో శాంతి భద్రతలు కట్టుదిట్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎన్నికల నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. అధికారులు నిర్వహించిన ఈ తనిఖీలతో స్థానికంగా భద్రతా వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందని అధికారులు తెలిపారు.

## మూర్ఛ వ్యాధితో బాధపడుతూ మహిళ ఆత్మహత్య



**చట్టం మెదక్ ప్రతినిధి :** మెదక్ జిల్లా చేగుంట మండలంలోని కర్నాల్ పల్లి గ్రామంలో మూర్ఛ వ్యాధితో బాధపడుతున్న ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపింది. గ్రామానికి చెందిన చింతాకుల యశోద, భర్త గంగయ్య, వయస్సు 38 సంవత్సరాలు, వృత్తి వ్యవసాయం. గత కొన్ని రోజులుగా మూర్ఛ వ్యాధితో బాధపడుతూ వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నప్పటికీ ఆశించిన ఫలితం లేకపోవడంతో ఆమె తీవ్ర మనస్తాపానికి గురైనట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో డిసెంబర్ 10, 2025 న ఉదయం ఎనిమిది గంటల సమయంలో తన వ్యవసాయ పొలం వద్ద గుర్తు తెలియని పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. చికిత్స కోసం ఆసుపత్రికి తరలించగా, ఈరోజు తెల్లవారుజామున మూడు గంటల సమయంలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై మృతురాలి తల్లి ఇక్కిరి నర్సమ్మ, భర్త శంకరయ్య, నివాసం చేరిల్ల గ్రామం, వెల్దుర్తి మండలం వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాద వాతావరణం నెలకొంది.

## ఆత్మీయ మిత్రుడు గడ్డం శేఖర్ యాదవ్‌కు ఘనంగా సన్మానం

- మిత్రుడు సర్పంచ్ కావడం అభినందనీయం



**చట్టం, శంషాబాద్ :** శంషాబాద్ మండల పరిధిలోని నర్కూడ గ్రామ పంచాయతీ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ ను సోమవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సన్మానించిన ఆత్మీయ మిత్రులు కోట మహేష్ గౌడ్, ఎల్గని మల్లేష్ గౌడ్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... చిన్ననాటి ఆత్మీయ మిత్రుడు గడ్డం శేఖర్ యాదవ్ భారీ మెజార్టీతో విజయం సాధించడం ఎంతో అభినందనీయమన్నారు. గ్రామం అభివృద్ధి జరగాలంటే యువతకే సాధ్యమన్నారు. భారీ విజయం సాధించిన గడ్డం శేఖర్ యాదవ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## చేగుంటలో గుర్తుతెలియని శవం లభ్యం



**చట్టం మెదక్ ప్రతినిధి :** మెదక్ జిల్లా చేగుంట మండలం చేగుంట గ్రామ శివారులోని రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న బాలాజీ వెంచర్ ప్రాంతంలో ఒక గుర్తుతెలియని మగ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. సమాచారం అందుకున్న చేగుంట పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు సుమారు 50 నుంచి 55 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. మృతుడి వివరాలు తెలియకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో విచారణ చేపట్టారు. ఈ ఘటనపై చేగుంట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, నివేదిక ఆధారంగా మరింత విచారణ చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు.

## రోడ్డు ప్రమాద బాధితుడికి అండగా నిలిచిన అదనపు ఎస్పీ మహేందర్



**చట్టం మెదక్ ప్రతినిధి :** మెదక్ జిల్లా తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన పాషా కలెక్టరేట్ ఎదుట ఉన్న మూల మలుపు వద్ద ద్విచక్ర వాహనం నుంచి జారి పడి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదం జరిగిన సమయంలో అదే మార్గంలో వెళ్తున్న మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్.మహేందర్ ఈ ఘటనను గమనించి వెంటనే తన వాహనాన్ని ఆపి సహాయక చర్యలు చేపట్టారు. రక్తస్రావంతో బాధపడుతున్న పాషాకు తక్షణమే స్పందించి, గన్ మెన్ సహాయంతో ఆటోలో అతడిని ఎక్కించారు. అనంతరం హెడ్ కానిస్టేబుల్ యాదగిరిని పాషాతో పాటు పంపి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స అందే వరకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ప్రమాద బాధితుడికి సకాలంలో వైద్యసహాయం అందేలా చేసిన అదనపు ఎస్పీ మానవీయత, సేవాభావం స్థానికుల ప్రశంసలను అందుకున్నారు.

## పసరగొండ గ్రామాభివృద్ధికి సేవ చేసే అవకాశం కలిపించండి

- ఉంగరం గుర్తుకు ఓటు వేసి గెలిపించండి
- గ్రామ సర్పంచ్ అభ్యర్థి కొట్టే శ్రీవాణి రమేష్




**చట్టం /పరకాల ;** దామర మండలం పసరగొండ గ్రామపంచాయతీ సర్పంచ్ పదవికి ఉంగరం గుర్తుతో పోటీ చేస్తున్న కొట్టే శ్రీవాణి రమేష్ గ్రామాభివృద్ధికి సంక్షేమ పథకాలే ప్రధాన ఆధారమని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇళ్ల పథకాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు, పాఠశాల, అంగన్‌వాడీల అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. మహిళలు, వృద్ధులు, వికలాంగులు, యువత సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ, పారదర్శక పాలనతో పసరగొండ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని వెల్లడించారు. ఉంగరం గుర్తుకే ఓటు గెలిపించాలని గ్రామ ప్రజలకు వారు విజ్ఞప్తి చేశారు.

## నా విజయం అలియాబాద్ గ్రామానికి అంకితం

- సర్పంచ్ శాతరాశి సనత్ కుమార్ పటేల్



**చట్టం /పరకాల;** గ్రామ నాయకుడిగా కాదు, గ్రామ సేవకుడిగా పనిచేస్తానని బీఆర్ఎస్ మద్దతుతో అలియాబాద్ గ్రామ సర్పంచ్గా విజయం సాధించిన శాతరాశి సనత్ కుమార్ పటేల్ తెలిపారు. తన విజయం అలియాబాద్ గ్రామానికే అంకితమని పేర్కొంటూ, తన గెలుపుకు సహకరించిన గ్రామ ప్రజలందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. తన విజయా నికి సహకరించిన పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## బిజెపి అభ్యర్థులను గెలిపించండి డాక్టర్ కాళీ ప్రసాదరావు



**చట్టం /పరకాల ;** గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా పరకాల నియోజకవర్గంలోని నడికుడా, దామెర మండలాలలోని పలు గ్రామాల్లో భారతీయ జనతా పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు మరి వార్డ్ మెంబర్ల గెలుపుకై ఇంటింట విస్తృత ప్రచార కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు పరకాల నియోజకవర్గం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు సీనియర్ నాయకులు మంద ఐల్లయ్య, మంద రమేష్, 60వ డివిజన్ కార్పొరేటర్ DR. దాస్యం అభినవ్ భాస్కర్, తిపరపు సుధీర్, సలుపల సురేష్, SKY విద్యాసంస్థలం చైర్మన్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు ఈ సందర్భంగా కాళీ ప్రసాద్ రావు గ్రామస్తులతో మాట్లాడుతూ.. గ్రామాల్లోని సీసీ రోడ్లు, వీధి లైట్లు, స్మశాన వాటికలు, అంగన్వాడి కేంద్రాలు, అదేవిధంగా రైతుల కోసం ఎరువులు విత్తనాలు సబ్సిడీతో పాటు కిసాన్ యోజన పథకంతో పంట పెట్టుబడి సాయం అందిస్తున్న ఘనత ప్రధాని నరేంద్ర మోడీని అన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు.

## మోస్రా లో శ్రీ కొమురవెల్లి మల్లన్న, బీరప్ప విగ్రహాల ప్రతిష్టాపన



**చట్టం న్యూస్ మోస్రా :** నిజామాబాద్ జిల్లా మోస్రా మండల కేంద్రంలో గొల్ల కురుమల ఆరాధ్య దైవమైన శ్రీ కొమరవెల్లి మల్లన్న, బీరప్ప విగ్రహాల ప్రతిష్టాపన పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రతిష్టాపన చేయటం జరిగిందని వేదపండితులు తెలియజేశారు. ఈ సందర్భంగా వేద పండితులు మాట్లాడుతూ ఈ విగ్రహాల ప్రతిష్టాపన చేయడం ద్వారా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండటమే కాకుండా ,పాడిపంటలు సమృద్ధిగా పండుతాయని వేద పండితులు తెలియజేశారు. ఈ కొమరవెల్లి మల్లన్న, బీరప్పల, విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో మండల పరిధిలోని గొల్ల కురుమలు మహిళామణులు అధిక సంఖ్యలో పాల్గొని కొమరవెల్లి మల్లన్న, బీరప్పల ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని గొల్ల కురుమ సంఘ సభ్యులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుల సంఘ సభ్యులైన ధూపల్లి గంగాధర్, గొల్ల లచ్చన్న, గోపరిపోశెట్టి, ధూపల్లి సాయిలు, గోపరి చిన్న సాయిలు, దూపెల్లి నరేందర్, దూపెల్లి శ్రీనివాస్, మేదరి శ్రీనివాస్, మండల పరిధిలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన కుల సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.


## ప్రచారంలో దూసుకుపోతున్న సర్పంచ్ అభ్యర్థి సూర్యకాంత్ పటేల్




**చట్టం డోంగ్లి ;** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం డోంగ్లి మండలం మొగ గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి సూర్యకాంత్ పటేల్ ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ సర్పంచ్ గా మరోసారి నన్ను గెలిపిస్తే పెండింగ్ లో ఉన్న సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇస్తూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. గ్రామంలో ఉన్న సమస్యలు తనకు తెలుసు అని సర్పంచుగా మరోసారి గెలిపిస్తే సమస్యలను పరిష్కరిస్తానని, గ్రామంలో ఉన్న విద్య, వైద్యం మెరుగుపరుస్తానని ప్రజలకు హామీ ఇస్తూ ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. యువకులు, నాయకులు కార్యకర్తలు కష్టపడి పని చేసి సూర్యకాంత్ పటేల్ ను 100% గెలిపించుకుంటామని విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

## బిక్కనూరు గ్రామంలో కాంగ్రెస్‌కు భారీ బలం

- ఎమ్మెల్యే సమక్షంలో 100 మందితో కాంగ్రెస్‌లోకి స్వతంత్ర సర్పంచ్ సాకలి సాయిలు



**చట్టం / ఎల్లారెడ్డి :** ఎల్లారెడ్డి మండలంలోని బిక్కనూరు గ్రామానికి చెందిన నూతనంగా గెలుపొందిన స్వతంత్ర సర్పంచ్ సాకలి సాయిలు సోమవారం హైదరాబాదులోని ఎమ్మెల్యే మదన్‌మోహన్ నివాసంలో, ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో అధికారికంగా చేరారు. ఈ సందర్భంగా గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు సుఖేందర్ రెడ్డి, సంజీవ్ రెడ్డి ఆధ్వర్యంలో బిక్కనూరు గ్రామానికి చెందిన సుమారు 100 మంది గ్రామస్తులు కూడా కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి సంకల్పం, ప్రజల పట్ల ఎమ్మెల్యే మదన్‌మోహన్ చూపుతున్న అంకితభావం ఆకర్షణీయంగా ఉండటంతోనే తాము కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు సాకలి సాయిలు తెలిపారు. గ్రామ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీలో ఉంటూ మరింత సమర్థంగా పనిచేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్‌మోహన్ మాట్లాడుతూ, బిక్కనూరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి లభిస్తున్న ప్రజాదరణ సంతోషకరమని అన్నారు. పార్టీలో చేరిన సాకలి సాయిలు సహా గ్రామస్తులందరికీ కాంగ్రెస్ కుటుంబం తరఫున స్వాగతం పలికారు. గ్రామ అభివృద్ధికి ప్రభుత్వపరంగా పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం



**చట్టం ఆర్మూర్:** గ్రామపంచాయతీ ఎన్నికలు మూడవ విడత నిర్వహణలో భాగంగా ఆర్మూర్ డివిజన్ పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, ఐ.పీ.ఎస్. ప్రజలు శాంతియుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించే విధంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మూడవ విడత ఎన్నికలు ఆర్మూర్ డివిజన్ పరిదిలో జరగనున్న నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లను నేడు ఆర్మూర్ ఎ.సి.పి కార్యాలయంలో సంబంధిత పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని తూ.చా తప్పకుండా పాటించాలని తెలియజేశారు. ప్రధానంగా ఆర్మూర్ డివిజన్ పరిధిలో గల సమస్యాత్మకమైన, అతిసమస్యాత్మకమైనటువంటి పోలింగ్ స్టేషను గుర్తించి పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ప్రతీ పోలింగ్ కేంద్రానికి నిర్దిష్ట దూరంలో మార్కింగ్ చేయించి , ప్రచారం , గుర్తులను ప్రదర్శించడం నివారించాలని అన్నారు. అవసరాన్ని బట్టి స్ట్రైకింగ్ ఫోర్స్ సేవలను వినియోగించుకొని గుంపులను చెదర గొట్టాలని అన్నారు. ఎన్నికలను ప్రభావితం చేసే డబ్బు, మద్యం, మరే ఇతరములు అక్రమ రవాణా జరగడానికి విలులేకుండా అంతర్ రాష్ట్ర, అంతర్ జిల్లా సరిహద్దు చెక్ పోస్ట్ లను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. విలేజ్ పోలీసు అధికారులు విపీఓ, ఆయా గ్రామలపై నిఘా ఉంచి, ముందస్తు సమాచారాన్ని సేకరించి, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు కృషి చేయాలని అధికారులకు తెలియజేసారు. ఎన్నికల రోజు సిబ్బంది తెల్లవారుజామునే తమకు కేటాయించినటువంటి పోలింగ్ బూతు యందు సక్రమమైన విధులు నిర్వహించాలని, ఎన్నికల తర్వాత ఓట్ల లెక్కింపు కార్యక్రమం మొత్తము పూర్తి అయ్యేవరకు ఎవరు ఎలాంటి ప్రలోభాలకు గురి కావద్దని, ఎన్నికల నియమావళిని తూ.చా తప్పకుండా పాటించే విధంగా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని విధినిర్వహణలో ఎలాంటి లోపాలు ఉన్న అట్టి సిబ్బందిపై తక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఏ.సి.పి జె. వెంకటేశ్వర్ రెడ్డి, ఆర్మూర్ సీఐ, ఎస్.హెచ్.ఓ పి.సత్యనారాయణ గౌడ్, ఆర్మూర్ రూరల్ సి.ఐ కె. శ్రీధర్ రెడ్డి, భీంగల్ సి.ఐ పి. సత్యనారాయణ గౌడ్, బాల్కొండ ఎస్. ఐ కె. శైలేందర్, నందిపేట్ ఎస్.ఐ జి. శ్యామ్ రాజ్ , వేల్పూర్ ఎస్.ఐ బి. సంజీవ్ , ఎస్.ఐ ముప్కాల్, కిరణ్ పాల్, మెండోరా ఎస్.ఐ సుహాసిని , భీంగల్ ఎస్.ఐ కె. సందీప్, మోర్తాడ్ ఎస్. ఐ బి.రాము , కమార్ పల్లి ఎస్.ఐ జి. అనీల్ రెడ్డి , ఏర్గట్ల ఎస్ ఐ పి..రాజేశ్వర్ , మాక్లూర్ ఎస్.ఐ రాజశేఖర్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## గ్రామాల అభివృద్ధికి సర్పంచుల పాత్ర ఎంతో కీలకం



**రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు మోత్కుపల్లి రాములు**

**మొయినాబాద్, చట్టం:**

గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు ఎంతో కీలకమని, సర్పంచులు పాలకవర్గంతో గ్రామాలను అభివృద్ధి చేయవలసిందిగా రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు మోత్కుపల్లి రాములు అన్నారు. సోమవారం మండల పరిధిలోని మోత్కుపల్లి, చందనగర్ గ్రామాల నూతన సర్పంచులను ఆయన ఘనంగా సన్మానించారు. మోత్కుపల్లి నూతన సర్పంచ్ సంపూర్ణ రాములు, చందానగర్ సర్పంచ్ మురళి కృష్ణలను ఆయన సన్మానించి ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాలకు సర్పంచులు ఎంతో అవసరమని తెలిపారు. అందులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచ్ ఎన్నికలు నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. గ్రామాలను అభివృద్ధి చేసేందుకు సర్పంచులు పాలకవర్గంతో కలిసి కృషి చేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని గ్రామాలలో ఎక్కువగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే గెలుపొందుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలే ఈ గెలుపుకు మలుపు అని అన్నారు. గ్రామాలలో ఉన్న సమస్యలను గెలుపొందిన సర్పంచులు అభివృద్ధి చేసినప్పుడే ప్రజలు గుర్తించి ఆదర్శంగా అభినందిస్తారని పేర్కొన్నారు. అభివృద్ధి పనులు చేసినప్పుడే సన్మానాలు అందుకుంటారని సూచించారు. ఈ కార్యక్రమంలో చందానగర్ మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, పూజారి రవి, చారి పాల్గొన్నారు.

## అనగనగా ఓ “గోరింటాకు”

- పాలన నీడలేక ప్రజల నరకయాతన
- డబ్బున్నోడిదే పెత్తనం.., పేదోడి గూడు కలగానే మిగిలిందా..?
- చరిత్రతో నిండిన గోరింటాకు గ్రామం.
- అన్ని ఉన్నా... అభివృద్ధి మాత్రం కనిపించని వైనం.
- పాలకులు మారినా... ప్రజల కష్టాలు మారలేదు.
- చరిత్ర ఉన్న ఊరే అయినా..., పేదలకు మాత్రం గూడు లేదు.
- ఆ "దొందు దొందే" ఈసారి పేదోడికే పట్టం?



**మహబూబాబాద్, చట్టం:**

చింతచెట్టు నీడలో నానమ్మ చుట్టూ కూర్చున్న ముద్దుబిడ్డల మాటలతో మొదలైన ఓ కథ...కానీ అది కథ కాదు..., ఒక నియోజకవర్గంలో చరిత్ర కలిగిన "గోరింటాకు" ఊరు ప్రజల నిజమైన జీవన గాథ..., “నానమ్మ... కథ చెప్పు...!” అన్న పిల్లల కోరికతో మొదలైన ఈ గోరింటాకు కథ, పాలకుల నిర్లక్ష్యంతో పల్లెల్లో నలిగిపోతున్న ప్రజల బతుకులను అద్దంలా చూపించింది.

**చరిత్రతో నిండిన గోరింటాకు గ్రామం..,**

అనగనగా... “గోరింటాకు” అనే పేరున్న ఓ గ్రామం. చారిత్రాత్మక ఆలయం, పురాతన సంస్కృతి, విశాలమైన పెద్ద చెరువు ఈ ఊరి ప్రత్యేకతలు. మూడు కళ్లతో, పది చేతులతో విరాజిల్లే త్రినేత్రుడికి అంకితమైన ఈ ఆలయాన్ని క్రీ.శ. 900లో ఓ రాజు నిర్మించాడని చరిత్ర చెబుతోంది. కాకతీయుల పాలనలో ఈ ఆలయం పునరుద్ధరణకు నోచుకుంది. అప్పటి రాజధానిగా ఉన్న కారణంగా ప్రసిద్ధ యాత్రికుడు మార్కో-పోలో కూడా ఈ ఆలయాన్ని ప్రస్తావించినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. ఆలయం సమీపంలో సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన పెద్ద చెరువు ఉంది. పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి అన్ని అవకాశాలు ఉన్నా... ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చే హామీలు, పాలకుల నిర్లక్ష్యం వల్ల అవన్నీ ఫైళ్లకే పరిమితమయ్యాయి.

**పండుగలు, పంటలు, ప్రజల జీవనం..**

మహాశివరాత్రి పండుగ కురవిలో అతిపెద్ద వేడుక. బతుకమ్మ, బోనాలు వంటి పండుగలను ప్రజలు సంప్రదాయబద్ధంగా జరుపుకుంటారు. పత్తి, మిరప పంటలే రైతులకు ప్రధాన ఆధారం. ప్రతి వారం జరిగే పెద్ద పశువుల అంగడి ప్రాంతవ్యాప్తంగా ప్రసిద్ధి. అన్ని ఉన్నా... అభివృద్ధి మాత్రం కనిపించని వైనం.

**ఎక్కడ వేసిన గొంగళి... అక్కడే**

ఉమ్మడి రాష్ట్రంలో ఆలయం, పెద్ద చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామంటూ పలుమార్లు చెట్లు తొలగించి, మట్టి పోసి చేతులు దులుపుకున్నారు. నూతన రాష్ట్రం ఏర్పడ్డాక ఆలయ అభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరు అయినా..., పాలక మండలి ఉన్న పనులు ఎక్కడా కనిపించలేదు. పెద్ద చెరువు నిర్లక్ష్యానికి గురై, అంగడి పట్టించుకునే నాధుడే లేకుండా పోయింది. గత పాలకులు చెరువు గట్టుపై బతుకమ్మ విగ్రహం ప్రతిష్ఠించి ప్రజల హామీలు నిలుపుకున్నారు. గత ఆలయ చైర్మన్ పాలక మండలి అయంలో అభివృద్ధి నోచుకోలేదు. ఇదిలా ఉండగా ఆలయం చుట్టూ ఉన్న ప్రభుత్వ భూముల కబ్జా ఆరోపణలు ప్రజల్లో ఆగ్రహం రేపుతున్నాయి. ఆలయానికి దశాబ్దాల చరిత్ర గలదు కాకతీయుల కాలంలో స్వయంభుగా వెలిసినట్టు చరిత్రకారులు చెబుతున్నారు. కానీ కొందరు దుర్బుద్ధితో పైసలే ప్రథమార్ధంలో వక్రబుద్ధిని అవలంబిస్తున్నారు. దీనిని ఆసరాగా తీసుకుని కొంతమంది వ్యక్తులు ప్రైవేట్ లాడ్జి ల పేరుతో ప్రేమ జంటలకు, వివాహిత అవివాహిత జంటలకు ఆశ్రయం కల్పిస్తూ వ్యభిచారాన్ని నిర్వహిస్తున్నారు. దీంతో చరిత్ర ఉన్న గోరింటాకు ఊరు ప్రతిష్ట పరువు తీస్తున్నారు.

**పాలకులు మారినా..., ప్రజల కష్టాలు మారలేదు**

ఈ పరిస్థితుల్లో ప్రజలు మరో నాయకుడికి అవకాశం ఇచ్చారు. కానీ రెండు సంవత్సరాలు గడిచినా అభివృద్ధి జాడ కనిపించలేదని గ్రామస్తులు వాపోతున్నారు. “తుంటెత్తేసి... మొద్దెత్తుకున్నట్టే” అంటూ పాలనపై "దొందు దొందే" అంటూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**గూడు లేని పేదల వేదన..**

చరిత్ర ఉన్న ఊరే అయినా..., పేదలకు మాత్రం గూడు లేదు. ఇప్పటికీ చాలామంది పేదలు పూరిగుడిసెల్లో జీవనం, మరికొందరు కిరాయి గదుల్లో నలుగుతున్నారు. గత పాలనలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కొంతమందికి మాత్రమే మంజూరయ్యాయి. అందులో ఎక్కువగా డబ్బున్నవారే లబ్ధిపొందారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం పాలకులు డబ్బులున్నోళ్లకే మళ్ళీ ఇండ్లు మంజూరు చేస్తున్నారు. పేదలకు ఇవ్వాల్సిన ఇళ్లను పొందిన నాయకులే ఇప్పుడు..., పేదల ఇళ్లకే ఓట్ల కోసం వస్తుండటంపై ప్రజలు మండిపడుతున్నారు.

**ఈసారి పేదోడికే పట్టం?**

స్థానిక గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఆ "దొందు.., దొందే" మూడో వ్యక్తి నిరుపేద సర్పంచ్ అభ్యర్థికి ఓటు వేయాలనే చర్చ గ్రామమంతా నడుస్తోందని నానమ్మ కథ ముగించింది. ఇది కథలా వినిపించినా..., గోరింటాకు గ్రామ ప్రజల గుండెల్లో నలుగుతున్న నిజం. ఇది కేవలం నానమ్మ చెప్పిన కథ కాదు..., పల్లెల్లో పాలనను ప్రశ్నిస్తున్న ప్రజల స్వరాజ్య గాథ. ఆ "దొందు.., దొందే" ఈసారి మూడో వ్యక్తి పేద సర్పంచ్ అభ్యర్థి కి పట్టం కట్టాలనే ఆలోచన ఉన్నట్లు ప్రజల్లో చర్చ జరుగుతుంది.

## చింరాజ్ పల్లి అభివృద్ధికి ముందుకొచ్చిన మహిళా

- కత్తెర గుర్తు పై సర్పంచ్ అభ్యర్థి రాజేండ్ల లావణ్య మురళి



**చట్టం ఆర్మూర్:** గ్రామపంచాయతీ ఎన్నికలలో నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలోని నందిపేట్ మండలం చింరాజ్ పల్లి గ్రామం నుండి సర్పంచ్ అభ్యర్థిగా రాజేండ్ల లావణ్య మురళి కత్తెర గుర్తుతో పోటీ చేస్తున్నారు. ఆమె మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని రంగాలలో సమగ్రంగా అభివృద్ధి చేయడమే నా ప్రధాన లక్ష్యం అన్నారు. రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం, డ్రైనేజీ, వీధిదీపాలు వంటి మౌలిక వసతులతో పాటు విద్య, వైద్యం, ఆరోగ్యం, మహిళా సాధికారత, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి ఒక్క సంక్షేమ పథకం అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తూ, చింరాజ్ పల్లి గ్రామాన్ని జిల్లాలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. గ్రామాభివృద్ధి కోసం తనకు ఒక అవకాశం ఇవ్వాలని, కత్తెర గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని చింరాజ్ పల్లి గ్రామ ప్రజలను రాజేండ్ల లావణ్య మురళి వినమ్రంగా కోరారు.

## వెల్మల్ గ్రామానికి సేవ చేసే అవకాశం ఇవ్వండి

- కత్తెర గుర్తు సర్పంచ్ అభ్యర్థి చిలుక భూషణ్



**చట్టం ఆర్మూర్:** ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి ఒక్క సంక్షేమ పథకం వెల్మల్ గ్రామానికి సక్రమంగా తీసుకువచ్చి, గ్రామాభివృద్ధికి పూర్తిగా వినియోగిస్తానని హామీ ఇస్తున్నా కత్తెర గుర్తు సర్పంచ్ అభ్యర్థి చిలుక భూషణ్ అన్నారు. ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలందరికీ, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా నిరంతరం కృషి చేస్తాను. రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం, డ్రైనేజీ, వీధిదీపాలు వంటి మౌలిక వసతులతో పాటు వెల్మల్ గ్రామాన్ని జిల్లాలోనే సర్వాంగ సుందరమైన, ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం అన్నారు. మీ అమూల్యమైన ఓటుతో భారీ మెజార్టీతో గెలిపిస్తే, అన్ని రంగాల్లో అభివృద్ధితో పాటు ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించడంలో ముందంజలో ఉంటానని మాట ఇస్తున్నాను అన్నారు. గ్రామాభివృద్ధి కోసం నాకు ఒక అవకాశం ఇవ్వాలని మీ అందరి పాదాభివందనాలతో వినమ్రంగా కోరుకుంటున్నాను. దయచేసి గ్రామ ప్రజలను నేను వేడుకునేది నా యొక్క అభివృద్ధిని చూడండి నన్ను భారీ మెజార్టీతో గెలిపించండి నా యొక్క గుర్తు కత్తెర గుర్తుకు ఓటు వేసి గెలిపించండి అంటూ ప్రచారంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కోట జాన్, కొమన్ పల్లి రాజన్న, దండు రాజన్న, సాదుల్ల విజయ్, చిన్న రామాగౌడ్, వంజరి మల్లేష్, నరేందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## వెల్మల్ గ్రామ అభివృద్ధికి భోగా రాము సర్పంచ్ బరిలో



**చట్టం ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలోని నందిపేట్ వెల్మల్ గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికలలో భోగా రాము సర్పంచ్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచారు. ఫుట్ బాల్ గుర్తు నుంచి పోటీ చేస్తున్న భోగా రాము మాట్లాడుతూ, గ్రామంలోని ప్రతి సమస్యను ప్రజలతో కలిసి పరిష్కరించడమే తన లక్ష్యమన్నారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమం, తాగునీటి సరఫరా, రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్యం, పెన్షన్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వెల్మల్ గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు తనకు ఒక అవకాశం ఇవ్వాలని, ఫుట్ బాల్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని గ్రామ ప్రజలను భోగా రాము విజ్ఞప్తి చేశారు.

## సిద్దేశ్వరునికి ఘనంగా పల్లకి సేవ



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన నవనాథ సిద్దుల గుట్టపై సోమవారం రోజు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి నవనాథ సిద్దేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. కొండ పై ఉన్న అన్ని ఆలయాలను దర్శించుకున్నారు. శ్రీశ్రీశ్రీ నంది మహారాజ్ ఆధ్వర్యంలో రామాలయం నుండి కోనేరు వరకు తిరిగి రామాలయం వరకు ఘనంగా పల్లకి సేవను భక్తి పాటలు పాడుతూ భజన చేస్తూ నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నేటి అన్నదాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం కొండపై నిర్మిస్తున్న కాటేజీలకు దాతలు విరాళాలు ఏమైనా చేయదలిస్తే ఆలయ కమిటీ సభ్యులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి.సుమన్, పిపీ గంగారెడ్డి, కోడిగల మల్లయ్య, చరణ్ రెడ్డి, జిమ్మీ రవి సంధ్య, కొంతం మంజుల మురళీధర్, బట్టు శంకర్, చందేసి శ్రీనివాస్, ప్రశాంత్ గౌడ్, హజారి సతీష్, బాషెట్టి నరేష్, రామా గౌడ్, భక్తులు పాల్గొన్నారు.

చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

## ఉమ్మెడ గ్రామంలో వినయ్ రెడ్డి, ఎన్నికల ప్రచారం



**చట్టం ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలోని నందిపేట్ మండలం ఉమ్మెడ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన గ్రామ సర్పంచ్ అభ్యర్థి నక్క భోజేందర్, వార్డు అభ్యర్థులకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించి ప్రసంగించిన ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి, మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి నక్క బోజేందర్, ని గెలిపిస్తే గ్రామాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళ్తానన్నారు. అలాగే రోడ్లు గాని, డ్రైనేజీలు గాని ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వ నిధులు ఇప్పించి సహాయం చేస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ అభ్యర్థి, వార్డు సభ్యుల అభ్యర్థులు ఉమ్మెడ కాంగ్రెస్ నాయకులు, మహిళ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## సోమర్పేట గ్రామంలో రాజకీయ రణరంగం–ట్రాక్టర్‌తో దూసుకొచ్చి హత్యాయత్నం

**ఘటనలో నిందితులపై కేసు నమోదు : ఎస్ఐ బొజ్జ మహేష్**



**చట్టం / ఎల్లారెడ్డి :** ఎల్లారెడ్డి మండలం సోమార్పేట గ్రామానికి చెందిన బిట్ల బాలరాజు ఈ నెల 14న జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తన ప్రత్యర్థి కురుమ పాపయ్యతో పోటీ పడి ఓటమి పాలయ్యాడు. అయితే నామినేషన్ దాఖలు చేసిన నాటి నుంచే కురుమ పాపయ్యతో పాటు అతని బంధువులు సాయి బాబా, కురుమ శంకర్, కురుమ చిరంజీవి, కురుమ సాయిలు, కురుమ స్వప్న, కురుమ లత, కురుమ శోభ, కురుమ దుర్గవ్వలు బాలరాజు మరియు అతని కుటుంబ సభ్యులను, మద్దతుదారులను బెదిరిస్తూ భయభ్రాంతులకు గురి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని ఎస్ఐ బొజ్జ మహేష్ తెలిపారు. మాకు అధికార పార్టీ అండదండలు ఉన్నాయి... ఎన్నికల్లో ఓడిపోతే మీ అంతు చూస్తాం అంటూ పలుమార్లు బెదిరింపులకు పాల్పడినట్లు బాలరాజు ఫిర్యాదులో వెల్లడించినట్లు చెప్పారు. ఈ నెల 15న బాలరాజు తన ఇంటి వద్ద పరామర్శకు వచ్చిన మద్దతుదారులతో మాట్లాడుతుండగా, గ్రామానికి చెందిన కురుమ చిరంజీవి తన జాండీర్ ట్రాక్టర్‌తో వేగంగా దూసుకొచ్చి అక్కడున్న వారిపైకి దూకుడుగా ఢీకొట్టినట్లు తెలిపారు. ఈ దాడిలో బండి భారతి, బండమీద బాలమణులకు తీవ్ర గాయాలు కాగా, పద్మ సత్తవ్వ, తోట శారద, గండి అద్విత్‌లకు కూడా గాయాలు అయినట్లు పేర్కొన్నారు. బాలరాజు మాత్రం తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడన్నారు. గాయపడిన వారిని వెంటనే ఆసుపత్రికి తరలించినట్లు, ఈ ఘటనపై బాలరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై హత్యాయత్నం సహా పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎల్లారెడ్డి ఎస్ఐ బొజ్జ మహేష్ తెలిపారు.

## ఇబ్బందులు తప్పవు... ఎమ్మెల్యే కేవీఆర్



**చట్టం ప్రతినిధి కామారెడ్డి :** అవినీతి రహిత కామారెడ్డి కోసం చేసే ప్రయత్నంలో కొన్ని ఇబ్బందులు తప్పవని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని రాజిరెడ్డి గార్డెన్ లో సోమవారం సాయంత్రం బీజేపీ మద్దతుతో గెలిచిన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

**అభ్యర్థులతో మాటామంతి..**

ముందుగా ఎన్నికల్లో ఓడిన అభ్యర్థులతో మాట్లాడారు. ఓటమికి గల కారణాలు, గ్రామాల పరిస్థితులను.. పోటీ చేసిన అభ్యర్థుల ద్వారా తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డిలో పంచాయతీ ఎన్నికల్లో డబ్బు, మద్యం లేకుండా ప్రజా సేవచేసే ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చిన గెలిచిన సర్పంచ్ లకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఓడిన అభ్యర్థులు అధైర్యపడొద్దని సూచించారు.

**ప్రజలకు సేవ చేయాలి కె.వి.ఆర్ .....**


డబ్బు, మద్యం లేకుండా గెలిస్తే ఐదేళ్ల పదవి కాలంలో ప్రజలకు సేవచేసే అవకాశం వస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అందుకే బీజేపీ బలపర్చిన అభ్యర్థులు మద్యం, డబ్బు లేకుండా సర్పంచ్ ఎన్నికల్లో పోటీచేసే ప్రయత్నం చేశారన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కూడా పోటీచేసి ప్రజల వద్దకు వెళ్తామన్నారు. మార్పుకోసం ప్రయత్నం చేస్తున్న సమయంలో ఇబ్బందులు తప్పవని, ఏది ఏమైనా ప్రజల తీర్పు శిరసావహిస్తామని పేర్కొన్నారు. అనంతరం వివిధ గ్రామాల్లో గెలిచిన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను శాలువాతో సన్మానించారు.

## ప్రచారంలో దూసుకుపోతున్న బి.ఆర్.ఎస్ సర్పంచ్ అభ్యర్థి



**చట్టం మద్నూర్ :** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం మద్నూర్ మండలం అంతాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి సంగమ్మ శంకర్ పటేల్ ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ సర్పంచ్ గా నన్ను గెలిపిస్తే మీ యొక్క సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇస్తూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. గ్రామంలో ఉన్న సమస్యలు తనకు తెలుసు అని సర్పంచుగా ఒకసారి గెలిపిస్తే సమస్యలను పరిష్కరిస్తానని, గ్రామంలో ఉన్న విద్య, వైద్యం మెరుగుపరుస్తానని ప్రజలకు హామీ ఇస్తూ ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. యువకులు, నాయకులు కార్యకర్తలు కష్టపడి పని చేసి సంగమ్మ శంకర్ పటేల్ ను 100% గెలిపించుకుంటామని విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

## సోమార్పేట్ ఘటన దురదృష్టకరం



**చట్టం / ఎల్లారెడ్డి :** ఎల్లారెడ్డి మండలం సోమార్పేట్ గ్రామంలో సోమవారం ఉదయం చోటుచేసుకున్న సంఘటన అత్యంత దురదృష్టకరమని, భాదాకరమని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు స్పష్టం చేశారు. ఈ మేరకు వీడియో సందేశం ద్వారా స్పందించిన ఎమ్మెల్యే, ఈ ఘటనపై తన ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ సంఘటనకు కారణమైన వారు ఎంతటి వారైనప్పటికీ వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే స్పష్టంగా హెచ్చరించారు. చట్టం ముందు అందరూ సమానమేనని పేర్కొంటూ, నిందితులపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని అన్నారు. ఈ ఘటనపై పోలీసులు ఇప్పటికే విచారణ చేపట్టారని, తాను కూడా పోలీసు అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. బాధ్యులను గుర్తించి, చట్టపరంగా కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు భరోసా ఇచ్చారు. గ్రామంలో శాంతి భద్రతలు కాపాడటం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన అన్ని చర్యలు చేపడతామని ఎమ్మెల్యే తెలిపారు.

# ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సంచలన వ్యాఖ్యలు

**దేవరుప్పల, చట్టం:**



స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా దేవరుప్పుల మండలం,దేవరుప్పుల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జక్కుల గంగరాజు గెలుపు కోసం టిపిసిసి ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. గ్రామాన్ని సందర్శించగా మహిళలు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొని పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికి భారీ ర్యాలీ తీశారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో కార్నర్ మీటింగ్ లో వాళ్ళు మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేండ్లలో ఏ ఒక్కరికీ కూడా రేషన్ కార్డు ఇవ్వలేదని,ఎవరైతే కాంగ్రెస్ పార్టీ అని తప్పుడు ప్రచారం చేసుకుంటున్నారో వాళ్ళు కాదని,అధికారం ఉన్నవాళ్ళను గెలిపించుకుంటారో లేక మహిళా సంఘాలను ఆదుకున్నవారిని గెలిపించుకుంటారో లేక మహిళలను కించపరచే వారిని గెలిపించుకుంటారో మీరే తేల్చుకోవాలని,గత ప్రభుత్వంలో మన పార్టీ వాళ్లకు సీఎమ్ఆరెఫ్ చెక్కులొస్తే పార్టీలో చేరితేనే ఇస్తామని,కానీ మన ప్రభుత్వం వచ్చినంక పార్టీలకు అతీతంతంగా అర్హులైన వారికి ఇస్తున్నామని,దేవరుప్పుల గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని,మమ్మల్ని ఎన్నిమాటలు అన్నాకూడా ఒక్క మాట కూడా మేము మాట్లాడుతలేమని,నేను వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని, గ్రామ అభివృద్ధి కోసం కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాల్సిన అవసరం మనందరికీ ఉందని,మన పార్టీ అభ్యర్థిని కాకుండా వేరే వారిని గెలిపించుకుంటే ఎటువంటి అభివృద్ధి జరగదని,వారికి ఓటేసి గెలిపిస్తే దిష్టిబొమ్మను కూర్చోబెట్టినట్టు కూర్చోబెట్టాలె తప్పా ఎటువంటి ఉపయోగం ఉండదని ,కాంగ్రెస్ పార్టీ ఏ పరిస్థితుల్లోనైనా ప్రజల సమస్యలను పరిష్కరించడానికి కట్టుబడి ఉంటుందని,మీరందరూ కూడా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి కేటాయించిన ఫుట్ బాల్ గుర్తుకు ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు .ఈ కార్యక్రమంలో విజయ డైరీ జిల్లా ఛైర్మెన్ కాసారపు ధర్మారెడ్డి,గ్రామ శాఖ అధ్యక్షుడు ఉప్పుల ఉప్పలయ్య, మండల యూత్ అధ్యక్షుడు పులిగిల్ల వెంకన్న,మండల నాయకులు బోనగిరి యాకస్వామి,రెడ్డి రాజుల రమేష్, తోటకూరి పాండుకృష్ణ,వార్డు సభ్యులు,గ్రామ నాయకులు,యువజన నాయకులు,మహిళా నాయకురాళ్లు,కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మూడో విడత ర్యాండమైజేషన్ పూర్తి



**చట్టం/ హనుమకొండ**

ఈ నెల 17న జరగనున్న మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బంది మూడవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు శివ కుమార్ నాయుడు, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరిష్ ల సమక్షంలో సోమవారం నిర్వహించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. ఈ ప్రక్రియను సాధారణ పరిశీలకులు, కలెక్టర్ లు నిశితంగా పరిశీలించారు. జిల్లాలోని ఆత్మకూర్, దామెర, నడికూడ, శాయంపేట మండలాల వారీగా ఆయా గ్రామపంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, ఓ.పీ. ఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. జిల్లాలో మూడవ విడతలో గల 68 గ్రామ పంచాయతీల సర్పంచ్, 634 వార్డు స్థానాలకు ఎన్నికల నిర్వహణ కోసం మొత్తం 626 ప్రిసైడింగ్ అధికారులు, ఓ. పీ. ఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించడం జరిగింది. ర్యాండమైజేషన్ ప్రక్రియలో డిఆర్.డి.ఓ మేన శ్రీను, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, జెడ్పి సీఈఓ రవి, తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ స్టేషన్లను సందర్శించిన ఆర్ఓ అచ్చ సుదర్శన్

**చట్టం/పరకాల :**

పంచాయతీ ఎన్నికల సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరి కోల్ లో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్ ల ఏర్పాట్లను ఆర్వో అచ్చ సుదర్శన్ పరిశీలించినారు. సోమవారం రోజున మూడో విడతలో జరగనున్న సర్పంచ్, వార్డ్ మెంబర్ ల ఎన్నికల సందర్భంగా.. పోలింగ్ స్టేషన్ ఆర్వో అచ్చ సుదర్శన్ పరిశీలించి పకడ్బందీగా ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శి సాంబశివరావు కు సూచించారు.వరికోల్ కేంద్రము లో చుట్టూ ప్రహరీ గోడ చుట్టూ, గ్రౌండ్లో విద్యుత్, మంచినీరు, వీల్ చైర్స్ లాంటి వసతులు సరిగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి సాంబశివ రావు కు సూచనలు అందజేశారు.

## గ్రామ పంచాయతీ మూడో విడత ఎన్నికలు



**గ్రామ పంచాయతీలలో 163 (BNS) చట్టం పకడ్బందీగా అమలు: జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్**


**చట్టం/హన్మకొండ**

గ్రామ పంచాయతీ మూడో విడత ఎన్నికలు జరుగు ఆయా మండలాలు, గ్రామపంచాయతీలలో 163 (BNS) చట్టం పగడ్బందీగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అన్నారు. 163 బీఎన్ఎస్ చట్టం అమలుపై కలెక్టర్ మాట్లాడుతూ మూడో విడత ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి మండలాల్లో సైలెన్స్ పీరియడ్ అమలులోకి వస్తుందని తెలిపారు. ఎన్నికల జరుగు మండలాల్లో పోలింగ్ ముగిసే వరకు ఎలాంటి బహిరంగ సభలు, ర్యాలీలు, ఊరేగింపులు, ఏ విధమైన ప్రచారాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. ఈ కాలంలో బయట నుండి వచ్చిన వ్యక్తులు సంబంధిత గ్రామ పంచాయతీ పరిధిలో ఉండకూడదని తెలిపారు. సైలెన్స్ పీరియడ్‌లో ప్రజలు గుంపులుగా చేరరాదని స్పష్టం చేశారు. పోలింగ్‌కు ముందు మరియు పోలింగ్ సమయంలో యంత్రాంగం పటిష్ఠ పర్యవేక్షణ చేపట్టాలని, ఎలాంటి ఎన్నికల ఉల్లంఘనలు జరుగకుండా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని, ఏదేని ఉల్లంఘన జరిగినట్లు గమనిస్తే ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకోవాలని అన్ని విభాగాల నోడల్ అధికారులను ఆదేశించారు. 163 బి. ఎన్.ఎస్ చట్టం 18 వ తారీకు ఉదయం 10 గంటల వరకు ఉంటుందని తెలిపారు.జిల్లాలో ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతి ఒక్కరూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలు పాటించాలని ఆయన ప్రజలకు సూచించారు.

## రంగయ్యపల్లి సర్పంచ్‌గాకు సునం నిర్మల రవీందర్ రెడ్డి

**హైదరాబాద్, చట్టం:**

రాష్ట్రంలో జరిగిన రెండో విడత సర్పంచ్ ఎన్నికల్లో సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రంగాయపల్లి సర్పంచ్ గా కుసునం నిర్మల రవీందర్ రెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం ప్రభుత్వ పాఠశాలలో ఎన్నికలు నిర్వహించారు. అనంతరం జరిగిన ఎన్నికల కౌంటింగ్ లో 44 ఓట్లతో నిర్మల రవీందర్ రెడ్డి గెలుపొందినట్టు అధికారులు ప్రకటించి సర్టిఫికెట్ ను అందజేశారు. దీంతో స్థానిక ఎమ్మెల్యే హరీష్ రావు వారిని అభినందించారు. ఈ సందర్భంగా తన గెలుపుకు సహకరించిన ఊరు ప్రజల అందరికీ నిర్మల రవీందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



## ఒక్కసారి సర్పంచిగా అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేస్తా



**చట్టం డోంగ్లి;** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం డోంగ్లి లో కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి రేఖ శివాజీ బోస్లే పాటిల్ ప్రచారం చేస్తూ ఒక్కసారి సర్పంచ్ గా అవకాశం ఇస్తే డోంగ్లి అభివృద్ధి పథంలో నడిపిస్తానని గ్రామంలో ఉన్న త్రాగునీటి , డ్రైనేజీ వంటి సమస్యలను పరిష్కరించి ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పిస్తానని హామీ ఇస్తూ ప్రచారంలో దూసుకు వెళ్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడంతో గ్రామంలో ఉన్న సమస్యలు ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి ప్రయత్నం చేస్తానని హామీ ఇస్తూ 17వ తేదీ ఓటింగ్ రోజు కత్తెర గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతున్నారు. వీరితోపాటు మాజీ సర్పంచ్ మహానంద మహిళలు తదితరులు పాల్గొని సర్పంచిగా రేఖ శివాజీ పటేల్ గెలిపించాలని ఓటర్లను కోరుతున్నారు.

## ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన సర్పంచులు



**చట్టం /పరకాల ;** రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలలో పరకాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. ప్రజల విశ్వాసంతో భారీ మెజారిటీతో గెలుపొందిన కాంగ్రెస్ సర్పంచులు, వార్డు సభ్యులు హనుమకొండ భవాని నగర్ లోని క్యాంపు కార్యాలయం నందు పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకానికి ఈ ఫలితాలు నిదర్శనమని తెలిపారు. గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని అన్నారు. ప్రజల సహకారంతో పరకాల నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని అన్నారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డిని కలిసిన వారిలో...పరకాల మండలం వెల్లంపల్లి గ్రామ సర్పంచ్ మచ్చ మహేందర్ & వార్డు సభ్యులు,పరకాల మండలం వెంకటాపూర్ గ్రామ సర్పంచ్ దుగ్యాల రాజేశ్వరరావు, గీసుగొండ మండలం ఏలుకుర్తి (హ) గ్రామ సర్పంచ్ జన్ను దివ్యభారతి మరియు వార్డు సభ్యులు,ఊకల్ (హ ) గ్రామ సర్పంచ్ కక్కెర్ల సుభాష్ మరియు వార్డ్ సభ్యులు, గంగాదేవి పల్లి గ్రామ సర్పంచ్ కుసం స్వప్న రమేష్,మరియాపురం గ్రామ సర్పంచ్ అర్పిత తిరుమల్ రెడ్డి మరియు వార్డు సభ్యులు,పరకాల మండలం అలియాబాద్ గ్రామ ఉపసర్పంచ్ అల్లే దీపంజలి దేవేందర్ మరియు వార్డు వార్డు సభ్యులు, సంగెం మండలం బిక్కోజి నాయక్ తండా గ్రామ సర్పంచ్ గుగులోతు లక్ష్మణ్ నాయక్,రామచంద్రాపురం గ్రామ సర్పంచ్ పులి రమేష్ మరియు వార్డు మెంబర్లు,గవిచర్ల గ్రామ సర్పంచ్ బాషిపాక సదయ్య మరియు వార్డు మెంబర్లు,గాంధీనగర్ గ్రామ సర్పంచ్ కోడూరి శ్రీనివాస్,గుంటూరు పల్లి గ్రామ సర్పంచ్ కందిమల్ల శ్రీకాంత్,కాపుల కనపర్తి గ్రామ సర్పంచ్ సదిరం చంద్రమౌళి,నర్సానగర్ గ్రామ సర్పంచ్ రొట్టె శ్రీలత,సోమలతండ గ్రామ సర్పంచ్ బానోతు సంధ్య కలిశారు.

## పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ శ్రేణులు సైనికుల్లా పని చేయాలి..గెలిపించుకోవాలి

**మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి**



**చట్టం /పరకాల ;** ప్రస్తుతం జరుగుతున్న పంచాయతీ ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపుకోసం పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం నియోజకవర్గంలోని దామెర మండలం దమ్మన్నపేట గ్రామంలో బిఆర్ఎస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి దుబాసి నవీన్ గెలుపుకోసం గ్రామంలో ఏర్పాటుచేసిన సన్నాహక సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల,గ్రామ బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలి ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**చట్టం / పరకాల ;** పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి దామెర మండల కేంద్రంతోపాటు పులుకుర్తి, దమ్మన్నపేట, ఓగులాపూర్, తక్కల్లపహాడ్, ముస్త్యాలపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పులుకుర్తిలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి బొల్లం స్వప్న వేణుగోపాల్, వార్డు మెంబర్ల గెలుపు కోసం ప్రచారం చేశారు. దామెరలో సర్పంచ్ అభ్యర్థి దైనంపెల్లి కళమ్మ, దమ్మన్నపేటలో సర్పంచ్ అభ్యర్థి సొప్పరి రాజేష్, ఓగులాపూర్లో సర్పంచ్ అభ్యర్థి మన్నెం ప్రకాశ్ రెడ్డి, తక్కెళ్ల పహాడ్లో సర్పంచ్ అభ్యర్థి కొతపెల్లి మానస, ముస్త్యాలపల్లి సర్పంచ్ అభ్యర్థి తోట కల్పనా రాజకుమార్ గెలుపు కోసం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

Printed, Published and Owned by SIRIGADA PRASAD and Printed at INDUR OFFSET PRINTERS, Opposite Cheer Hanuman Temple, Weekly Bazar, Nizamabad District,Telangana 503001., and Published at: H.No. 3-3-486/2, Gayathrinagar, Varni road, Nizamabad District, Telangana - 503001.,Editor: SIRIGADA PRASAD. RNI.No. TELTEL/2010/32350. Cell ;9948884497. prasadsirigada27@gmail.com